ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనకాపల్లి

జిల్లా వార్తలు

శనివారం 8 ఫిబ్రవరి 2025



అరుదైన నాగకేసరి వృక్షాలను

చూసొద్దాం రండి..

» ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేవలం హుకుంపేట మండలం బంగారంగరువు గ్రామ సమీపంలో మాత్రమే దర్శనం

8లో



రంగురంగుల ఆకులతో ఆకర్షణీయంగా ఉన్న నాగకేసరి చెట్లు

ఎంకే వల్లాపురం కాటా వద్ద రోజుల తరబడి నిలిచిపోయిన చెరకు బండ్లు



క్రషింగ్ జాప్యం.. రైతులకు శాపం

గోవాడ షుగర్స్‌లో అస్తవ్యస్తంగా పరిస్థితి

» చెరకు రైతులకు చుక్కలు చూపిస్తున్న యాజమాన్యం

» కాటాల వద్దకు చెరకు వచ్చిన వారం రోజుల తరువాతే ఫ్యాక్టరీకి రవాణా

» ఎండకు ఎండిపోయి బరువు తగ్గడంతోపాటు రసనాణ్యతపై ప్రభావం

» ఇటు రైతులకు, అటు ఫ్యాక్టరీకి నష్టం

» యాజమాన్యం తీరుపై రైతులు ఆగ్రహం

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):

చోడవరం మండలం గోవాడ షుగర్ ఫ్యాక్టరీ అధికారులు, చెరకు రైతులకు చుక్కలు చూపిస్తున్నారు. ఫ్యాక్టరీలో తరచూ క్రషింగ్‌కు అంతరాయం ఏర్పడుతున్నది. సత్వరమే మరమ్మతు పనులు పూర్తి చేయడం లేదు. దీంతో ఫ్యాక్టరీ యార్డుతోపాటు పలు కాటాల (చెరకు సేకరణ కేంద్రాలు) వద్ద పెద్ద సంఖ్యలో చెరకు ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు నిలిచిపోతున్నాయి. సాంకేతిక కారణాలు, బగాస్ (చెరకు పిప్పి) పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ఎప్పుడు పడితే అప్పుడు క్రషింగ్ నిలిచిపోతున్నది. మరమ్మతులు చేపట్టి, క్రషింగ్‌ను పునరుద్ధరించడానికి కనీసం ఒక రోజు పడుతున్నది. మళ్లీ కొద్ది గంటల్లోనే ఎక్కడో ఒక చోట సమస్య తలెత్తి క్రషింగ్ నిలిచిపోతున్నది. కాటాల వద్ద రోజుల తరబడి చెరకు ఉండిపోవడంతో ఎండిపోయి బరువు, రస నాణ్యత తగ్గిపోతున్నాయి. దీనివల్ల రైతులకు ప్రత్యక్షంగా, పంచదార రికవరీ శాతం తగ్గిపోయి ఫ్యాక్టరీకి పరోక్షంగా నష్టం వాటిల్లుతున్నది.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో మాడుగుల మండలంలో ఎం.కెవల్లాపురం (ఘాట్‌రోడ్డు జంక్షన్), ఒమ్మలి, కేజేపురం గ్రామాల్లో చెరకు కాటాలు ఉన్నాయి. ఫ్యాక్టరీ ఫీల్డ్ సిబ్బంది ఇచ్చిన షెడ్యూల్ (కట్టింగ్ ఆర్డర్లు) ప్రకారం ఆయా రైతులు తమ పొలాల్లో చెరకు నరికించి, సమీపంలోని కాటా వద్దకు ట్రాక్టర్లు, ఎడ్ల బండ్ల ద్వారా తీసుకువస్తుంటారు. ఇక్కడ వుండే సిబ్బంది తూకం వేసి, ఫ్యాక్టరీ యాజమాన్యం పంపిన లారీల్లోకి లోడింగ్ చేయించి ఫ్యాక్టరీకి తరలిస్తుంటారు. పొలంలో చెరకు నరికిన తరువాత 24 గంటల్లో ఫ్యాక్టరీకి తరలించి క్రషింగ్ జరిపితే పంచదార రికవరీ శాతం బాగుంటుంది. అంతకన్నా ఎక్కువ సమయం పడితే పంచదార దిగుబడి తగ్గిపోతుంది. ఇది ఫ్యాక్టరీ ఆదాయంపై ప్రభావం చూపుతుంది. ఇక కాటాల వద్దకు వచ్చిన చెరకును వెంటనే తూకం వేయకుండా జాప్యం చేస్తే బరువు తగ్గిపోయి రైతులకు నష్టం వాటిల్లుతుంది. ఈ కారణాల వల్ల ఏ కాటా పరిధిలో, ఏయే రైతులు ఎప్పుడు చెరకు నరికి ఫ్యాక్టరీకి తరలించాలో సిబ్బంది ముందుగానే షెడ్యూల్ రూపొందించి, రైతులకు కట్టింగ్ ఆర్డర్లు జారీ చేస్తుంటారు. కానీ ఈ ఏడాది చెరకు క్రషింగ్ సీజన్ నెల రోజులకుపైబడి ఆలస్యంగా ప్రారంభం కావడం, క్రషింగ్ మొదలైన తరువాత పలుమారు అంతరాయం ఏర్పడడంతో ఆ ప్రభావం చెరకు సరఫరాపై పడుతున్నది. ఫ్యాక్టరీ నుంచి లారీలు రాకపోవడంతో కాటాల చెరకు బండ్లు రోజుల తరబడి వుండిపోతున్నాయి. కొద్ది రోజుల నుంచి ఎండ తీవ్రత పెరగడంతో కాటాల వద్దనే చెరకు ఎండిపోతున్నది. ఈ నెల ఒకటో తేదీన కాటాల వద్దకు రైతులు తీసుకువచ్చిన చెరకు ఏడో తేదీన కూడా ఇక్కడే వుండిపోయిందంటే ఫ్యాక్టరీ యాజమాన్య తీరు ఎంత అధ్వానంగా వుందో అర్థం చేసుకోచ్చు.



ఎంకేవల్లాపురంలో చెరకు కాటా

ఎంకే వల్లాపురం చెరకు కాటాకు గత నెల 28వ తేదీ నుంచి ఈ నెల ఏడో తేదీ వరకు 220 టన్నులకుపైగా

... మిగతా 8వ పేజీలో

రోడ్డు ప్రమాదంలో

అటవీ సెక్షన్ అధికారి మృతి

నర్సీపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):



రండి పొట్టన్న (ఫైల్ ఫొటో)

పట్టణంలోని శ్రీకన్య థియేటర్ వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో అటవీ శాఖ ఉద్యోగి మృతిచెందాడు. బైక్‌పై వెళుతున్న అటవీ శాఖ సెక్షన్ అధికారిని ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటనకు సంబంధించి పట్టణ సీఐ గోవిందరావు అందించిన వివరాలిలా ఉన్నాయి.

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి అటవీ డివిజన్ మర్రిపాకల రేంజ్‌లోని పలకజీడి సెక్షన్ అధికారిగా పని చేస్తున్న రండి పొట్టన్న(54) నర్సీపట్నం మునిసిపాలిటీలోని పెదబొడ్డేపల్లిలో నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై నర్సీపట్నం వచ్చి తిరిగి పెదబొడ్డేపల్లి వెళుతున్నారు. ఈ క్రమంలో శ్రీకన్య థియేటర్ వద్ద విశాఖపట్నం వెళుతున్న నాన్‌స్టాప్ ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొని, ద్విచక్ర వాహనం హ్యాండిల్ చిక్కుకుంది. దీంతో బైక్‌తోసహా బస్సు కొద్ది దూరం ఈడ్చుకుపోయింది. పొట్టన్నకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు సీపీఆర్ చేశారు. ఈలోగా 108 అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న భార్య రాజేశ్వరి, కుమారుడు శ్రీనివాస్ కల్యాణ్, కుమార్తె స్పందన వచ్చి భోరున విలపించారు. పట్టణ సీఐ గోవిందరావు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. పొట్టన్న భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎన్టీఆర్ ఆస్పత్రికి అవినీతి జబ్బు

ప్రసూతి విభాగంలో అడ్డగోలుగా డబ్బులు వసూలు

» సుఖ ప్రసవం అయితే రూ.2 వేలు, సిజేరియన్ అయితే రూ.5 వేలు

» వసూళ్ల దందాపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు

» స్వయంగా విచారణ జరిపిన విజయకృష్ణన్

» గైనిక్ వార్డులో డబ్బులు తీసుకుంటున్నట్టు నిర్ధారణ

» ప్రసూతి విభాగం వైద్యాధికారిణిపై సస్పెన్షన్ వేటు



సస్పెండైన డాక్టర్ శోభాదేవి



ఎన్టీఆర్ ఆస్పత్రి ప్రసూతి వార్డు (ఫైల్)

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆస్పత్రి ప్రసూతి విభాగానికి అవినీతి జబ్బు పట్టుకుంది. ప్రసవం కోసం వచ్చే వారు నిరుపేదలని కూడా కనికరం లేకుండా వారి నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. సాధారణ డెలివరీ అయితే రెండు వేల రూపాయలు, సిజేరియన్ అయితే రూ.5 వేలు దండుకుంటున్నారు. ప్రసూతి వార్డులో అక్రమ వసూళ్లపై ఇటీవల కొంతమంది జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె ఇటీవల ఆస్పత్రికి వెళ్లి ప్రసూతి వార్డులో తనిఖీలు నిర్వహించారు. కొంతమంది బాలింతలతో మాట్లాడారు. శస్త్ర చికిత్సల కోసం ఆస్పత్రి సిబ్బంది డబ్బులు తీసుకున్నారని ఇద్దరు చెప్పారు. దీంతో సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రసూతి వార్డులో డెలివరీ కేసులకు డబ్బులు వసూలు చేస్తున్న నిర్ధారణకు వచ్చిన ఆమె.. వైద్యాధికారిణి సస్పెన్షన్ కోసం వైద్య, ఆరోగ్య శాఖకు సిఫారసు చేశారు. దీంతో ప్రసూతి విభాగం సివిల్ సర్జన్ డాక్టర్ శోభాదేవిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి ప్రసూతి విభాగంలో 50 పడకలు ఉన్నాయి. గైనిక్ విభాగానికి రోజూ 80 నుంచి 120 మంది వరకు మహిళలు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంటుంటారు. నెలలు నిండిన గర్భిణులు డెలివరీ కోసం ఆస్పత్రి వార్డులో చేరుతుంటారు. అయితే ప్రసూతి వార్డులో కొంతమంది సిబ్బంది, ప్రసవం కోసం వచ్చి వారి బంధువుల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇక ఆడ బిడ్డ పుడితే ఒక రేటు, మగబిడ్డ పుడితే మరో రేటు పెట్టారు. సాధారణ ప్రసవంతో ఆడబిడ్డ పుడితే రూ.1,000, మగ బిడ్డ అయితే రూ.2 వేలు; సిజేరియన్ చేయాల్సి వస్తే ఆడబిడ్డ పుడితే రూ.2 వేలు

... మిగతా 8వ పేజీలో

శిశువు ప్రాణాలు తీసిన నిర్లక్ష్యం

బాలింత కుటుంబీకులు ఆరోపణ

» కోటవురట్ల సీహెచ్‌సీలో ఘటన

» హెడ్ నర్సు క్షమాపణ

» ఘటనపై డీసీహెచ్‌ఎస్‌కు ఆస్పత్రి సూపరింటెండెంట్ నివేదిక



బాలింతకు క్షమాపణ చెబుతున్న హెడ్ స్టాఫ్‌నర్సు పద్మ (ఇన్‌సెట్‌లో) కాన్పు సమయంలో చనిపోయిన శిశువు

కోటవురట్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా గర్భిణి కడుపులోనే బిడ్డ చనిపోయిందంటూ కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆస్పత్రి సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వైసీపీ నాయకుడు వచ్చి సర్దిచెప్పడంతో సిబ్బంది తరఫున హెడ్ స్టాఫ్ నర్సు క్షమాపణ చెప్పారు. ఈ సంఘటనకు సంబంధించి బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

ఎలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామానికి చెందిన చెన్నంశెట్టి సుశీలాదేవి గర్భిణి. నెలలు నిండడడంతో బుధవారం ఉదయం వైద్య తనిఖీల నిమిత్తం కుటుంబ సభ్యులు కోటవురట్ల సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. పరీక్షించిన గైనికాలజిస్ట్.. ఈ నెల 9వ తేదీన డెలివరీ అవుతుందని చెప్పారు. దీంతో ఇంటికి తిరిగి వెళ్లిపోయారు. గురువారం ఉదయం స్వల్పంగా నొప్పులు రావడంతో కోటవురట్ల వచ్చి సీహెచ్‌సీలో చేర్చారు. శుక్రవారం ఉదయం గైనికాలజిస్ట్ ర్యూస్కీ స్కానింగ్ చేశారు. బిడ్డ ఆరోగ్యంగానే వుందని, సిజేరియన్ చేయాల్సిన అవసరం లేదని, సాధారణ ప్రసవం జరుగుతుందని చెప్పారు. తరువాత వైద్య సిబ్బంది విధులు మారే సమయంలో సుశీలదేవిని పర్యవేక్షించడంలో నిర్లక్ష్యం వహించారు. ఈ క్రమంలో ఉమ్మునీరు ఎక్కువగా పోయింది. మధ్యాహ్నం షిఫ్ట్‌కు వచ్చిన సిబ్బంది, సుశీలాదేవికి డెలివరీ చేయగా, శిశువు ఊపిరి పీల్చుకోవడంలేదు. ఆ సమయంలో విధుల్లో వున్న చిన్నపిల్లల వైద్యురాలు గోదాదేవి వచ్చి శిశువును పరిశీలించారు. కానీ అప్పటికే చనిపోయినట్టు చెప్పారు. కాన్పు సమయంలో గైనికాలజిస్ట్ లేకపోవడం, లేబర్ రూమ్‌లో విధుల్లో వున్న సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే శిశువు చనిపోయిందంటూ సుశీలాదేవి కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆస్పత్రి సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో వేరేచోట వున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రసాద్ సమాచారం తెలుసుకుని ఆస్పత్రికి వచ్చి విచారణ చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న జడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి భర్త, వైసీపీ నాయకుడు సత్తిబాబు ఆస్పత్రికి వచ్చి ఇటు బాధితులతో, అటు సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. వైద్యసిబ్బంది నిర్లక్ష్యంగా కారణంగానే శిశువు చనిపోయిందని తెలుసుకుని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బాధిత కుటుంబీకులను శాంతింపజేసి, వైద్యసిబ్బంది తరఫున హెడ్ స్టాఫ్ నర్సు పద్మతో క్షమాపణ చెప్పించారు. కాగా ఈ సంఘటనపై నివేదికను డీసీహెచ్‌ఎస్‌కు పంపనున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

అవినీతి ఖజానా

ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి మళ్లీ పోస్టింగ్!

» కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకున్నారనే అభియోగంపై రెండేళ్ల క్రితం పాడేరు సబ్ ట్రెజరీ అధికారి, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు సస్పెన్షన్

» ఆ మొత్తాన్ని వెనక్కి ఇచ్చేయాల్సిందిగా నాటి కలెక్టర్ ఆదేశం

» ఆయన బదిలీ కావడంతో మారిపోయిన సీన్

» అక్రమాలే జరగలేదంటూ విచారణ ముగించిన ఖజానా అండ్ అకౌంట్స్ విభాగం ఉన్నతాధికారులు

» ముగ్గురికీ విశాఖలో పోస్టింగ్

» పెద్దమొత్తంలో ముడుపులు అందినట్టు ప్రచారం



పాడేరు సబ్‌ట్రెజరీ కార్యాలయం

(విశాఖపట్నం/ పాడేరు-ఆంధ్రజ్యోతి)

సుమారు రూ.7 లక్షలు లంచం తీసుకున్నారనే అభియోగంపై సస్పెన్షన్‌కు గురైన ట్రెజరీ అధికారులకు క్లీన్ చిట్ ఇస్తూ విశాఖపట్నంలో పోస్టింగ్ ఇవ్వడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంలో భారీ మొత్తం చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరులో మోదకొండమ్మ ఉత్సవాలకు 2022లో విద్యుత్ అలంకరణ పనులు చేసిన కాంట్రాక్టర్ రూ.34.3 లక్షల బిల్లులను గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగం ద్వారా ప్రభుత్వానికి సమర్పించారు. ఆ బిల్లు (గుర్తింపు నంబర్: 1338602) అమరావతిలో సీఎఫ్‌ఎంఎస్‌లో 2022 సెప్టెంబరులో పాసైంది. దీంతో రూ.34.3 లక్షలను పాడేరు సబ్ ట్రెజరీలో అదే ఏడాది డిసెంబరులో సదరు కాంట్రాక్టర్‌కు చెల్లించారు.

రూ.7 లక్షలు లంచం తీసుకున్నారని కలెక్టర్ ఫిర్యాదు

బిల్లు రూ.34.3 లక్షలు చెల్లించేందుకు స్థానిక సబ్ ట్రెజరీ అధికారులు రూ.7 లక్షలు లంచం తీసుకున్నారని సదరు కాంట్రాక్టర్ 2023 మార్చి నెలలో అప్పటి అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. రూ.4 లక్షలు సీఎఫ్‌ఎంఎస్ అధికారులకు, రూ.3 లక్షలు స్థానిక సబ్ ట్రెజరీలో అధికారులు తీసుకున్నారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. పాడేరు సబ్‌ట్రెజరీ అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ తన వద్దకు పిలిపించుకుని ఈ వ్యవహారంపై నిలదీశారు. కాంట్రాక్టర్ వద్ద లంచంగా తీసుకున్న రూ.7 లక్షలు తక్షణమే వెనక్కి చెల్లించాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేస్తానని హెచ్చరించారు. అయితే తాము రూ.7 లక్షలు తీసుకోలేదని, సీఎంఎఫ్‌ఎస్ విభాగానికి రూ.4 లక్షలు, సబ్‌ట్రెజరీ మామూళ్లుగా రూ.లక్ష చొప్పున మొత్తం రూ.5 లక్షలు మాత్రమే తీసుకున్నామని కలెక్టర్ వద్ద అంగీకరించారు. ఆ రూ.5 లక్షలు బాధితుడికి తిరిగి చెల్లించాలని కలెక్టర్ ఆదేశించారు. అందుకు సబ్‌ట్రెజరీ అధికారులు అంగీకరించారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో 2023 మార్చి 13న ఒక సబ్ ట్రెజరీ అధికారి, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్‌లను సస్పెండ్ చేశారు.

కలెక్టర్ మారడంతో సీన్ మారింది..

ఖజానా అధికారులపై ఫిర్యాదు చేసిన అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చిత్తూరుకు బదిలీ కావడంతో మొత్తం

... మిగతా 8వ పేజీలో

విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

» అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు



ఉపాధ్యాయుడిని స్టేషన్‌కు తీసుకువెళుతున్న పోలీసులు (ఫైల్)

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):

ఒక ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో ఉపాధ్యాయుడు దారపు గంగాప్రసాద్‌పై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. మండలంలోని వడ్డాదిలో నేషనల్ టాలెంట్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినికి మ్యాథ్స్‌లో సందేహాలు వున్నాయి. వీటిపై ఈ నెల 5వ తేదీన ఉపాధ్యాయుడు గంగాప్రసాద్‌ను కలవగా, తరువాత నివృత్తి చేస్తానని చెప్పాడు. సాయంత్రం విద్యార్థినిని తరగతి గదిలోకి పిలిచి చేయి పట్టుకుని అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయం

... మిగతా 8వ పేజీలో

నాడు వారు.. ఇప్పుడు వీరు!

అధికారంలో ఎవరున్నా.. ఆగని గ్రావెల్ అక్రమ తవ్వకాలు

» గత ఐదేళ్లలో కొండలు, గుట్టలను తవ్వుకుపోయిన వైసీపీ నేతలు

» ఇప్పుడు అదే దారిలో కూటమి నేతలు

» యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు, అమ్మకాలు

» చోద్యం చూస్తున్న అధికారులు



సబ్బవరం మండలం గంగవరంలో అక్రమంగా గ్రావెల్ తవ్విన ప్రదేశం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటికీ.. జిల్లాలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు, అమ్మకాలు యథావిధిగానే సాగిపోతున్నాయి. ఏ పార్టీ అధికారంలో వుంటే ఆ పార్టీ నాయకులు గ్రావెల్ తవ్వుకుంటూ భారీగా డబ్బులు గడిస్తున్నారు. గత సాధారణ ఎన్నికల ముందు వరకు వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వుకోగా, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ పార్టీల నాయకులు అదే బాటలో నడుస్తున్నారు.

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో మెటల్, సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇందుకోసం గ్రావెల్ అవసరం ఏర్పడింది. మరోవైపు అనకాపల్లి చుట్టు పక్కల మండలాలు, జాతీయ రహదారి పక్కనున్న గ్రామాలు, చోడవరం, నర్సీపట్నం వంటి పట్టణ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వీటిలో రోడ్ల నిర్మాణం, ఖాళీ స్థలాలను గ్రావెల్‌తో ఎత్తు చేస్తున్నారు. దీంతో గ్రావెల్‌కు

... మిగతా 8వ పేజీలో

బంధిత శ్రమ నేరం : జడ్జి విజయ



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ

ఎలమంచిలి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మర్రిబంద సమీపం ఇటుకల పరిశ్రమ ఆవరణలో శుక్రవారం బంధిత శ్రామిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ మాట్లాడుతూ 1976లో దేశంలో బంధిత శ్రామిక నిరోధక చట్టం అమలులోకి వచ్చినట్టు చెప్పారు. ఈ చట్టం ప్రకారం బంధిత శ్రమ నేరమన్నారు. అయినప్పటికీ వ్యవసాయం, ఇటుక బట్టీలు, గృహాలు, హోటళ్లు, కర్మాగారాలు వంటి అనేక రంగాల్లో ఇప్పటికీ ఈ సమస్య కనిపిస్తుందన్నారు. ముఖ్యంగా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు ఈ సమస్యకు గురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వాల కృషితో పాటు ప్రజల సహకారం అవసరమన్నారు. బాధితులకు పునరావాసం కల్పించడం, వారికి విద్యా ఉపాధి వంటివి అందించడం ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ డి.వెంకట్రావు, ఎలమంచిలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ధూళి నూకరాజు, ప్యానెల్ న్యాయవాదులు బి.హరిశంకరరావు, టి.నూకరాజు, పి.సుభాషిణి, లోక్ అదాలత్ సభ్యుడు పివి.రమణ, కార్మిక శాఖ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, పరిశ్రమ ప్రతినిధులు కేవీరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి : సీఐ



విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవంలో సీఐ ధనుంజరావు తదితరులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశనుంచే లక్ష్యసాధనకు కృషిచేస్తూ తద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎలమంచిలి సీఐ ధనుంజరావు సూచించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గతనెల ఐదో తేదీన పదో తరగతి విద్యార్థులకు మెరిట్ టెస్టు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన పద్దెనిమిది మందిని ఎంపిక చేశారు. వీరికి పట్టణంలోని కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బహుతి ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. రానున్న పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.బాలాజీ మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతికి ఇటువంటి పోటీ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం విజేతలకు సీఐతో పాటు, పట్టణ ఎస్ఐ సావిత్రి, హెచ్ఎం రమణ, సంఘం డివిజన్ కార్యదర్శి అబి, సీహెచ్.రాము, లక్ష్మణరావు, శ్రీను, రాఘవేంద్ర, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మరాజుపేటలో సీతారాముల విగ్రహాల ఊరేగింపు



మునగపాక, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : తిమ్మరాజుపేట గ్రామ పురవీధులు శుక్రవారం రామ నామ స్మరణతో మార్మోగాయి. శనివారం సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాలను ప్రతిష్ఠించనున్న నేపథ్యంలో మేళతాళాలు, బాజా భజంత్రీలతో గ్రామంలో ఊరేగించారు. దారిపొడవునా భక్తులు దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో భాగంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ప్లాస్టిక్ కవర్ల నిషేధం అందరి బాధ్యత

» మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు పిలుపు » వ్యాపారుల సమావేశంలో పలు సూచనలు



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు

ఎలమంచిలి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలో ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి అంతా సహకరించాలని కమిషనర్ ప్రసాదరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం ఇక్కడ వ్యాపారులతో ప్లాస్టిక్ నిషేధంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా పేర్కొన్నారు. పర్యావరణ హితంతో పాటు ప్రజారోగ్య రక్షణ లక్ష్యంగా మునిసిపాలిటీలో అన్ని వర్గాలవారు ప్లాస్టిక్ నిషేధాజ్ఞలు పాటించాలన్నారు. ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు, వినియోగం కారణంగా ప్రజా జీవనానికి ఆటంకం ఏర్పడుతుందన్నారు. మునిసిపాలిటీలోని అన్ని వ్యాపార సముదాయాల నిర్వాహకులు నిషేధిత ప్లాస్టిక్ కవర్ల విక్రయాలతో పాటు వినియోగాన్ని నిలుపు చేయాలని స్పష్టం చేశారు. ప్రజలంతా ఇంటి నుంచి మార్కెట్ వచ్చే సమయంలో నార సంచులు కానీ, ప్రత్యామ్నాయ సంచులు కాని వెంట తీసుకు రావాలన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులతో పాటు వ్యాపారులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో క్యాన్సర్ వ్యాధి దూరం



రామన్నపాలెంలో మహిళలు మానవహారం

ఎలమంచిలి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తులసీనగర్, యాతపేట, సతకంపట్టు ప్రాంతాల్లోని డ్వాక్రా మహిళలకు శుక్రవారం స్థానిక వైద్య సిబ్బంది క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. మెప్మా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు, సచివాలయ వైద్య సిబ్బంది కేన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాగమణి, సత్యవతి, జగన్మోహిని లక్ష్మి, ఆర్‌పీలు అరుణ, పుష్ప, నర్మద తదితరులు పాల్గొన్నారు.

రామన్నపాలెంలో..

అచ్యుతాపురం : ముందస్తు వైద్య పరీక్షలతో క్యాన్సర్‌కు చెక్ పెట్టవచ్చునని సీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ లిఖిత, డాక్టర్ శ్రావ్య అన్నారు. శుక్రవారం రామన్నపాలెంలో క్యాన్సర్‌పై ఏర్పాటైన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. పదేళ్లు దాటిన వారందరికీ తమ సిబ్బంది ఇంటివద్దే వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ఇందుకు అంతా సహకరించాలని కోరారు. అనంతరం గ్రామంలో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో జి.భవాని, రమణమ్మ, ధర్మిరెడ్డి సరోజిని తదితరులు పాల్గొన్నారు.



ఎలమంచిలిలో మహిళలకు అవగాన కల్పిస్తున్న సిబ్బంది

నేటి నుంచి పూడిమడకలో మాఘపౌర్ణమి వేడుకలు



పూడిమడక తీరంలో జగన్నాథ స్వామి

అచ్యుతాపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పూడిమడక జగన్నాథస్వామి ఆలయంలో శనివారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు మాఘపౌర్ణమి ఉత్సవాలు నిర్వహించనున్నా మని ఆలయ ప్రధానార్చకులు పులఖండం గోపాలాచార్యులు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని తొలిరోజు ఉదయం నుంచి నిత్యార్చన, అభిషేకాలు, పుణ్యాహవచనం, ధ్వజారోహణ అనంతరం వేణుగోపాల స్వామి కల్యాణం వంటివి జరుపుతామన్నారు. 11న పూడిమడక జగన్నాథస్వామి ఆలయంలో జాగరణ, మర్నాడు బుధవారం మాఘపౌర్ణమి సందర్భంగా భక్తుల పుణ్య సముద్ర స్నానాలు, ఉదయం ఐదు గంటలకు సుదర్శన స్వామికి చక్రస్నానం, అనంతరం ఆలయంలో గల వేణుగోపాల స్వామి, లక్ష్మీదేవి, సుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి దర్శనాలు ఉంటాయన్నారు. 13న వేణుగోపాల స్వామికి శ్రీపుష్పయాగం, ప్రసాద వితర ణతో ఈ వేడుకలు ముగుస్తాయన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

స్త్రీలపై దాడులు అరికట్టాలని మానవహారం



ఎలమంచిలి ప్రధాన రోడ్డుపై విద్యార్థినుల మానవహారం

ఎలమంచిలి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : స్త్రీలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థినులు ఇక్కడ మానవహారం నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యకుడు అభిషేక్ మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలపై దాడులు జరుగుతుండడం అన్యాయమన్నారు. వీటిని అరికట్టేందుకు అంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వీటికి ప్రధాన కారణమైన మద్యం, మత్తు పదార్థాలను నివారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా ప్రతినిధులు కృపా, రాజేష్, సింహాద్రి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై స్పందించిన జిల్లా అధికారులు



గ్రావెల్ తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : గ్రావెల్ అక్రమ తవ్వకాలను అనకాపల్లి ఆర్డీవో అయేషా ఏపీఐఐసీ డీజెడ్ఎం సూర్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. దోసూరు పంచాయతీ గండివానిపాలెంలో బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) ప్రహరీ గోడను ఆనుకొని ఉన్న గ్రావెల్‌ను తవ్వి గ్రామంలో ఇంటర్నల్ రోడ్లు నిర్మిస్తున్నారు. దీనిపై 'గండివానిపాలెంలో దర్జాగా గ్రావెల్ తవ్వకాలు' శీర్షికతో ఇటీవల 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. ఈ తవ్వకాల వల్ల బార్క్ ప్రహరీ గోడ కూలిపోయే ప్రమాదం ఉండటంతో వీరు శుక్రవారం పరిశీలన జరిపారు. పూర్తి నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్టు చెప్పారు.

ఘనంగా అభయాంజనేయ తీర్థం



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రాంబిల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పారాయుడుపాలెంలో శుక్రవారం అభయాంజనేయస్వామి తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి స్వామికి విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై దర్శించుకున్నారు. నిర్వాహక పెద్దలు మాజీ సర్పంచ్ ఆకుల రామారావు, నానేపల్లి నాగేశ్వరరావు, పట్టెం నాగేశ్వరరావు తదితరులు పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది. ఇదిలావుంటే, ఈ ఉత్సవం సందర్భంగా మండలస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పన్నెండు జట్లు తలపడ్డాయి. విజేతలకు బహుమతులు అందజేశారు.



పోటీలను ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు



రేవుపోలవరం సముద్ర తీరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మాఘ పౌర్ణమి ఏర్పాట్ల పరిశీలన

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమి జాతర కోసం మండలంలోని రేవుపోలవరం సముద్ర తీరంలో ఏర్పాట్లను అధికారులు శుక్రవారం పరిశీలించారు. తహసీల్దార్ రమేశ్‌బాబు, ఎంపీడీవో సత్యనారాయణ, సీఐ రామకృష్ణ, ఎస్ఐ విభీషణరావు గ్రామంలోని సముద్రతీరంలో పర్యటించి పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పుణ్య స్నానాలు ఆచరించడానికి అధిక సంఖ్యలో తరలిరానున్న భక్త జనానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ఏర్పాట్లపై అధికారుల బృందం ప్రణాళిక వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని రేవుపోలవరం గ్రామానికి చెందిన వైసీపీ నేత చోడిపల్లి రమణ కుటుంబానికి జేసీఎస్ రాష్ట్ర కన్వీనర్ హర్షవర్ధన్ రెడ్డి ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం రేవుపోలవరం వెళ్లి వైసీపీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు, మండల నాయకుల సమక్షంలో మృతుడి భార్య లక్ష్మికి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైసీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, జేసీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరకాసుల గోవింద్, సర్పంచ్ మల్లె లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి: డీహెచ్‌పీఎస్



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నినాదాలు చేస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

పాయకరావుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్ పార్కులో ఇటీవల అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కడలి శివప్రకాశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పలువురు నాయకులతో కలిసి అంబేడ్కర్ పార్కులో విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వడ్లమూరి సత్తిబాబు, బోడపాటి రాంజీ, సీపీఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావు, నాయకులు గారా నాగేంద్ర, పోలేటి వంశీ, మడగల నాని, పిల్లి సింహాద్రి, నేమాల బాబి పాల్గొన్నారు.

భక్తజన సంద్రం రేబాక

» నేత్రపర్వంగా గూడుపమ్మతల్లి క్షేత్ర ప్రారంభోత్సవం

» ఎనిమిది వేల మందికి అన్నప్రసాదాలు



అమ్మవారి సారెతో క్యూ లైన్లలో కిక్కిరిసిపోయిన భక్తులు.. రేబాక గూడుపమ్మతల్లి

నక్కపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గ్రామంలో గూడుపమ్మతల్లి క్షేత్రం (శక్తిపీఠం) ప్రారంభోత్సవం నేత్రపర్వంగా సాగింది. సుమారు రూ.కోటి వ్యయంతో దాతల సహకారంతో కొత్తగా నిర్మించిన ఈ క్షేత్రంతో పాటు దేవతా విగ్రహాల ప్రతిష్ఠ, కలశస్థాపన వంటి కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజు, సర్పంచ్ సాధిరెడ్డి శ్రీను, సాదిరెడ్డి చిన వెంకన్న, కాసులు ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. వేదపండితులు సత్యదేవ శర్మ, శ్రీపాద ప్రణవ్ శ్రీరామ్, వైలవరభట్ల పవన్‌తేజ చండీ హోమం, నవగ్రహ మండపారాధన, అష్టాదశ శక్తిపీఠాలు, 101 గ్రామ దేవతల విగ్రహాల ఆవిష్కరణ, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలను నిర్వహించారు. కొత్తగా నిర్మించిన ఆలయంలో అమ్మవారి విగ్రహావిష్కరణ భక్తుల సమక్షంలో వైభవంగా సాగింది. ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూ లైన్లన్నీ భక్తులతో కిటకిటలాడిపోయాయి. ఆలయ పరిసరాల్లోనే కాకుండా రేబాక గ్రామమంతా జనసంద్రంగా మారిపోయింది. ప్రధాన రహదారిపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సీఐ కె.కుమారస్వామి నేతృత్వంలోసిబ్బంది ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం దాతలు, శ్రీప్రకాశ్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో సుమారు ఎనిమిది వేల మంది భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. పలు పార్టీలకు చెందిన నాయకులు కంబాల జోగులు, వీసం రామకృష్ణ, కొప్పిశెట్టి వెంకటేశ్, పాకలపాటి రవిరాజు, కోసూరి శ్రీను,పోలినాటి నానాజీ, ఎస్ఎస్ఎఫ్ జిల్లా ప్రతినిధులు, అమ్మవారిని దర్శించుకున్నారు. అనేక మంది మహిళా భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు.

అల్లూరి విగ్రహావిష్కరణ

రేబాక క్షేత్రంలో దేవతా విగ్రహాలతో పాటు ఆలయం ఆవరణలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించారు. తుని మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, జనసేన నేత గెడ్డం బుజ్జి, నాయకులు ఎస్.నరసింహమూర్తి, రవిరాజు, ఎస్.వెంకట్రాజు, కె.నూకరాజు, వి.శ్రీను, సుధాకర్ ఈ కార్యక్రమం నిర్వహించారు.

బాలికపై లైంగిక దాడి చేసిన ఉపాధ్యాయుడిని శిక్షించాలి

చోడవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బుచ్చెయ్యపేట మండలం వడ్డాది నేషనల్ టాలెంట్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన ఉపాధ్యాయుడిని శిక్షించాలని పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు నందా రపు భాస్కర్ డిమాండ్ చేశారు. అలాగే స్కూల్ అనుమతులు కూడా రద్దు చేయాలని కోరారు. ట్యూషన్లు, స్పెషల్ క్లాసుల పేరుతో ఆడపిల్లలను రాత్రి వరకూ ఉంచడం, తెల్లవారుజామున పాఠశాలకు రప్పించడం వంటి చర్యలకు పాల్పడుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్రీప్రకాష్‌లో ఉత్సాహంగా 'స్పందన'

» అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

పాయకరావుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం స్పందన యువజనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విద్యా సంస్థల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ జ్యోతి ప్రజ్వలనచేసిన అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.కృష్ణారెడ్డి, మోడరేటర్ గ్లోరియాతో కలిసి శాంతి కపోతాలు ఎగురవేసి యువజోత్సవాలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చుకునేందుకు స్పందన వేదిక కాగలదన్నారు. అనంతరం విద్యార్థి అతిథులతో నిర్వహించిన 'కెరియర్‌లో సాఫ్ట్ స్కిల్స్ పాత్ర' అనే అంశంపై నిర్వహించిన చర్చాగోష్టి ఎంతో ఆసక్తికరంగా కొనసాగింది. అలాగే విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్ వీవీఎస్‌బీ.బంగార్రాజు, వైస్ ప్రిన్సిపాల్ పి.సుబ్బారావు అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్



ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న సీఈవో నారాయణమూర్తి

నీటి ఎద్దడి నివారణకు రూ.6 కోట్లు మంజూరు

» జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి

కోటవురట్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం రూ.6 కోట్లు మంజూరయ్యాయని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) నారాయణమూర్తి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో నీటి పథకాల నిర్వహణకు ఈ నిధులు వెచ్చిస్తామన్నారు. మండల పరిషత్ ఆస్తులు వివరాలను పట్టిక రూపంలో ఏర్పాటు చేయాలని ఎంపీడీవోలకు ఆదేశించినట్టు చెప్పారు. అంగన్‌వాడీ భవనాల గురించి అధికారులు అడిగితెసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎంఈజీపీ ద్వారా రుణాలు అందిస్తున్నదని, లక్కబొమ్మలు తయారుచేసే కార్మికులకు ఈ రుణాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథం, ఈవోపీఆర్‌డీ రఘు, ఏవో చంద్రశేఖర్, ఏపీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీడబ్ల్యూ పథకాన్ని పరిశీలించిన సీఈవో

ఎస్.రాయవరం: మండలంలోని చినగుమ్ములూరులో సమగ్ర రక్షిత నీటి పథకం (సీపీడబ్ల్యూ)ను జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి శుక్రవారం పరిశీలించారు. ఈ ట్యాంకు నుంచి ఎన్ని గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుందని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి ట్యాంకులను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఆనందరావు, ఏఈఈలు కల్యాణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి అంబేడ్కర్‌కు ఘన నివాళులు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రమాబాయి అంబేడ్కర్ 127వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు ఉపాధ్యాయులతో కలిసి రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విజయాల కోసం వెనకుండి నడిపించిన గొప్ప త్యాగమూర్తి రమాబాయి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లలితాంబ, విజయ కుమారి, కరుణకుమారి, శోభరాణి, అనిత, ప్రకాశ్ పాల్గొన్నారు.

ఘనంగా దొంగల డోపోత్సవం



పాండురంగస్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాధా రుక్మిణి సహిత పాండురంగస్వామి ఆలయంలో పాండురంగ స్వామివారి దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం దొంగల డోపు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు కృష్ణస్వామి పాండురంగస్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం తిరుమంగైయాళ్వార్ దొంగల డోపు ఉత్సవాన్ని అత్యంత కన్నుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణ మూర్తులకు దర్శించుకుని తరించారు.

నేడు స్వామివారి చక్రస్నానం

స్వామివారి దివ్య కల్యాణోత్సవాల్లో శనివారం చక్రస్నానం నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధానార్చకులు కృష్ణస్వామి తెలిపారు. ఉదయం 6 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తరించాలని ఆయన కోరారు.

దుర్గాదేవి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజరు పంచాయతీ అడ్డరోడ్డు తిమ్మాపురంలో దుర్గాదేవి ఆయల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ కర్రి సత్యనారాయణ సొంత నిధులతో నూతనంగా ఈ ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. శుక్రవారం నిర్మాణ పనులను ప్రారంభించారు.

నేడు కశింకోటలో
గౌరీపరమేశ్వరుల ఉత్సవం

▸▸ ఏర్పాట్లు పూర్తి ▸▸ పిండి వంటలతో అమ్మవారికి సారె సమర్పణ



గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

కశింకోట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోటలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం శనివారం జరగనుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టినట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు వేగి గోపీకృష్ణ, కాండ్రేగుల సతీష్, వేగి వెంకట్రావు తెలిపారు. ఉదయం ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తామన్నారు. నేలవేషాలు, స్టేజీ ప్రోగ్రాంలు వంటివి ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవమూర్తులను గ్రామ పురవీధుల్లో రథంపై తెల్లవార్లూ ఊరేగించనున్నట్టు చెప్పారు. ఇదిలావుంటే, ఈ వేడుకల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి సారెను సమర్పించారు. తొలుత మహిళలు తమ ఇళ్లలో తయారు చేసిన వివిధ రకాల పిండి వంటలు, పసుపు కుంకుమ, అరటి పండ్లు, కొబ్బరికాయలు తదితరాలు పళ్లాల్లో పేర్చి ఊరేగింపుగా ఆలయానికి తీసుకు వెళ్లారు. అక్కడ నైవేద్యంగా సమర్పించిన అనంతరం ప్రసాదంగా పంచిపెట్టారు. ఉత్సవానికి తరలివచ్చే భక్తులు తమ వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు ప్రత్యేక ప్రదేశాలను ఏర్పాటు చేశామని సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. సరోజిని విల్లా దగ్గర, టైల్స్ ఫ్యాక్టరీ, ఎంపీడీవో ఆఫీసు దగ్గర పార్కింగ్ స్థలాలను కేటాయించినట్టు చెప్పారు.

హెల్మెట్.. రక్షణ కవచం

▸▸ ద్విచక్ర వాహనచోదకులు విధిగా ధరించాలి ▸▸ అవగాహన ర్యాలీలో డీఎస్పీ శ్రావణి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రావణి



హెల్మెట్ ధరించి ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, వాహనచోదకులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనచోదకులంతా విధిగా హెల్మెట్ ధరించాలని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి సూచించారు. ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత సుంకరమెట్ట జంక్షన్ వద్ద డీఎస్పీ ఈ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. హెల్మెట్ ధరించి ప్రయాణం చేసినప్పుడు ప్రమాదం జరిగినా ప్రాణానికి హాని ఉండదన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని స్పష్టం చేశారు. గతంలో హెల్మెట్ ధరించకుండా రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన వారికి సంబంధించిన సంఘటనలను ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ వివరించారు. నిరంతరం వాహనచోదకులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే హెల్మెట్ ధరించకుండా రెండుసార్లు పట్టుబడితే వారి లైసెన్సు కూడా రద్దవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం, ట్రాఫిక్ సిబ్బంది, బైక్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

డీవార్మింగ్ డేను విజయవంతం చేయండి : కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన (డీవార్మింగ్ డే) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం వైద్యశాఖ, విద్యాశాఖ, శిశుసంక్షేమ శాఖ అధికారులతో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ఏర్పాట్లపై కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల పదో తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం, 17న మాప్ అప్ డే కార్యక్రమాలు జరగనున్నట్టు చెప్పారు. ఈ రెండు కార్యక్రమాలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. డీవార్మింగ్ డే రోజున ఒకటి నుంచి 19 సంవత్సరాల పిల్లలకు అల్బెండాజోల్ 400 మిల్లీగ్రాముల మాత్రను నమిలి మింగించాలన్నారు. ఒకటి నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఆరు నుంచి 12 ఏళ్ల పిల్లలకు ఆయా పాఠశాలలు, కళాశాలల్లోనూ నమిలి మింగించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని పిల్లలకు ప్రభుత్వం వీటిని ఉచితంగా అందిస్తుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి రవికుమార్, ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాతకు పూజలు



అమ్మవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలతో వస్తున్న లక్ష్మీనారాయణ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారి ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవాల ముగింపోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు), పాలక మండలి సభ్యులు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన, చండీహోమం, నీరాజన మంత్ర పుష్పం వంటి పూజలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోరుకొండ బుచ్చిరాజు, డాక్టర్ గ్రంధి శేషుకుమార్, బిక్కవాటి కృష్ణకుమార్, కొరుపోలు జగదీశ్వరరావు, శ్రీధరాల సోమరాజు, వుప్పల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'నిరంతర కృషితో లక్ష్య సాధన'



వేడుకల్లో మాట్లాడుతున్న రియర్ అడ్మిరల్ మురళీమోహన్‌రాజు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలని రియర్ అడ్మిరల్ మురళీమోహన్‌రాజు సూచించారు. ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన వైబ్రెంట్ డైట్ వేడుకలు శుక్రవారం ముగిసిన సందర్భంగా ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రతి విద్యార్థికి జీవితంలో లక్ష్యం ఉండాలని, దానికోసం నిరంతరం కృషి చేయాలని వివరించారు. భారత నావికాదళం చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ కెప్టెన్ ధీరజ్ మాట్లాడుతూ భవిష్యత్తు గురించి తీసుకునే మంచి నిర్ణయాలు విద్యార్థుల జీవితాలను చక్కగా తీర్చిదిద్దుతాయన్నారు. గౌరవ అతిథి భావరాజు మాట్లాడుతూ జీవితంలో ఏ కష్టం వచ్చినా తల్లిదండ్రులు మాత్రమే మీ వెంట ఉంటారని విద్యార్థులకు సూచించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, వైబ్రెంట్ డైట్ కన్వీనర్ డాక్టర్ కె.సుజాత, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గణేష్ ప్రసాద్‌రెడ్డి, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ మేనేజర్ గోవిందరావు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలని యూనియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ ఎ.గోవిందరావు అన్నారు. శుక్రవారం ఇక్కడి డీవీఎన్ కళాశాలలో ఇనిస్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పోస్టర్ మేకింగ్ కాంపిటీషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పోస్టర్లను, పీపీటీలను ఆయన తిలకించి మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు నూతన టెక్నాలజీతో ప్రదర్శించిన హెల్మెట్లు, జీపీఎస్ సిస్టం ఆధారిత అప్లికేషన్స్, బయాలజీ విద్యార్థులు ఆరోగ్యకరమైన వంటకాలు ఆకట్టుకున్నాయన్నారు. ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.దయామాధురి, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణపై అవగాహన



తుమ్మపాలలో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్థులు, పంచాయతీ సిబ్బంది

తుమ్మపాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం తుమ్మపాలలో పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం క్యాన్సర్ నివారణకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈవో ఈశ్వరరావు మాట్లాడుతూ క్యాన్సర్‌ను పారద్రోలేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. పంచాయతీ నేతృత్వంలో పీహెచ్‌సీ సిబ్బంది ప్రతి రోజూ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారని, గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే శరీరంపై స్పర్శ లేని మచ్చలు కలిగినవారు తక్షణమే వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. అనంతరం అంతా కలిసి క్యాన్సర్ మహమ్మారిని తరిమికొడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కోన అప్పారావు, కోన దుర్గేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తి సౌకర్యాలతో పేదలకు పక్కా గృహాలు

▸▸ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి
▸▸ ఏపీ గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ తాతయ్యబాబు ఆదేశం
▸▸ పలు గ్రామాల్లో అర్బన్ హౌసింగ్ స్కీమ్ ఇళ్ల పనులు పరిశీలన



పైడివాడఅగ్రహారం అర్బన్ హౌసింగ్ స్కీమ్ కాలనీలో పర్యటిస్తున్న బత్తుల తాతయ్యబాబు, అధికారులు

సబ్బవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల కోసం నిర్మిస్తున్న గృహాలను త్వరితగతిన పూర్తిచేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు సూచించారు. మండలంలోని గొల్లలపాలెం, పైడివాడ అగ్రహారం, పెదముషిడివాడ, అసకపల్లి గ్రామాల్లో అర్బన్ హౌసింగ్ స్కీమ్ కింద నిర్మిస్తున్న ఇళ్లను శుక్రవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, లేబర్ కాంట్రాక్టర్లతో మాట్లాడుతూ అన్ని రకాల మౌలిక సదుపాయాలతో గృహాలను లబ్ధిదారులకు అప్పగించాల్సి ఉంటుందన్నారు. గృహాల్లో దిగిన వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇళ్ల నిర్మాణంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యతలో ఎటువంటి లోటుపాట్లు ఉన్నా ఉపేక్షించేది లేదని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ ఎండీ రాజబాబు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల గృహ నిర్మాణ శాఖ పీడీలు సీహెచ్.సత్తిబాబు, శ్రీనివాసరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించండి

▸▸ అధికారులకు జీవీఎంసీ జెడ్సీ రమణ సూచన



మంచినీటి సరఫరా కేంద్రం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్సీ రమణ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : రిజర్వాయర్ వద్ద ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులోకి తీసుకురావాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ బీవీ రమణ అధికారులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. తుమ్మపాల పంచాయతీ పరిధిలోని జీవీఎంసీ ప్రధాన తాగునీటి సరఫరా కేంద్రాన్ని పరిశీలించారు. రెండు రోజులుగా వస్తున్న నీటి గురించి తెలుసుకున్నారు. నీటిలో ఉన్న కాలుష్యాన్ని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ల్యాబ్‌కు పంపించి తనిఖీ చేయాలని సూచించారు. రంగు పూర్తిగా మారిన తరువాత ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేని విధంగా తాగునీటిని సరఫరా చేయాలన్నారు. అలాగే మెయిన్ రోడ్డులోని బాలకృష్ణ బస్టాప్ పరిసరాలను తనిఖీ చేసి పరిసరాల పరిశుభ్రతకు తక్షణ చర్యలు తీసుకోవాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. రైల్వేస్టేషన్ వద్ద అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. క్యాంటీన్ ముందు ఇతరులు వాహనాలు ఎక్కువగా పార్కింగ్ చేయడం వల్ల రైల్వే స్టేషన్‌కు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ పాల సేకరణ ధర పెంచాలి

▸▸ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పశుపోషణ ఖర్చులు భారీగా పెరిగినందున ఆ నిష్పత్తిలో పాడి రైతులకు పాల ధరను పెంచేందుకు విశాఖ డెయిరీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో శుక్రవారం ఏర్పాటైన విశాఖ డెయిరీ పరిధిలోని పాల రైతు ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. పాల సేకరణ ధరను తగ్గించి రైతులను నష్టపరచడం సరైనది కాదన్నారు. డెయిరీ పరిధిలో జరుగుతున్న అక్రమాలపై ప్రభుత్వం వేసిన హౌస్ కమిటీ విచారణకు ఇచ్చి అరవై రోజుల గడువు పూర్తయినా ఇంతవరకు విచారణ ముందుకు సాగలేదని ఆరోపించారు. వెంటనే విచారణ పూర్తిచేసి బాధ్యులను శిక్షించాలని కోరారు. కర్రి అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రైతు సంఘాల ప్రతినిధులు భూలోక నాయుడు, గొంప కృష్ణమూర్తి, వి.రమణ, రెడ్డి రమణమూర్తి, గండి నాయనబాబు తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు రెవెన్యూ పరిధిలో అక్రమ క్వారీపై ఫిర్యాదు

▸▸ తక్షణమే చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు వినతి

తుమ్మపాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం మార్టూరు రెవెన్యూ పరిధి సర్వే నంబరు ఒకటిలో నిర్వహిస్తున్న అక్రమ క్వారీపై చర్యలు తీసుకోవాలని గ్రామ టీడీపీ నాయకుడు కోడి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మైన్స్, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్టూరు రెవెన్యూ పరిధి సర్వే నంబరు ఒకటిలో శనివాడ సత్యారావు పేరిట ఉన్న క్వారీలో అతని సమీప బంధువు పరిమితికి మించి తవ్వకాలు చేపట్టినట్లు ఆరోపించారు. కేవలం ఒక్క హెక్టారుకు మాత్రమే లీజు పర్మిషన్ ఉండగా అంతకు మించి తవ్వకాలు చేపట్టి అక్రమ వ్యాపారాలు జరిపించినట్టు ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని ఆయన కోరారు.

ఆర్చరీలో ప్రతిభ చాటిన గణేశ్‌కు అభినందన



కాంస్య పతకం సాధించిన గణేశ్

పరవాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాఖండ్‌లో ఇటీవల నిర్వహించిన 38వ జాతీయ క్రీడల్లో అద్భుత ప్రతిభ చూపిన విశాఖ జిల్లాకు చెందిన ఆర్చరీ క్రీడాకారుడు తిరుమూరు గణేష్ మణిరత్నంను జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు పి. సూర్యనారాయణరెడ్డి శుక్రవారం అభినందించారు. ఆర్చరీ కాంపౌండ్ పురుషుల వ్యక్తిగత విభాగంలో మణిరత్నం కాంస్య పతకం, కానో స్లోలోమ్ ఉమెన్స్ (కె-1) మిక్స్‌డ్ కాంపౌండ్ విభాగంలో రజత పతకం సాధించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి నిశాంత్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కోశాధికారి భాస్కర్, పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, వైజాగ్ ప్రొఫైల్స్ అధినేత వి.కృష్ణారావు తదితరులు అభినందించారు

తాగునీటి ట్యాంకు వద్ద పారిశుధ్య లోపం

▸▸ పట్టించుకోని పంచాయతీ ▸▸ ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు



వెంకటపతిపాలెం తాగునీటి ట్యాంకు వద్ద దుస్థితి

పరవాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ వెంకటపతిపాలెంలో మినీ రక్షిత మంచినీటి పథకం ట్యాంకు వద్ద అపారిశుధ్యం నెలకొంది. ట్యాంకు చుట్టూ మురుగు తిష్ఠ వేయడంతో పాటు ట్యాంక్ చుట్టూ ఉన్న ప్లాట్ ఫారం వద్ద నాచుపట్టింది. నెలలు తరబడి ఇదే దుస్థితి ఉన్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ట్యాంకు వద్ద దుర్వాసన వెదజల్లుతోందని, దీనికితోడు ప్లాట్‌ఫారం పైన నాచు వల్ల అప్పుడప్పుడు జారిపడుతున్నామని చెపుతున్నారు. ఇదిలావుంటే, ట్యాంక్ పైనుంచి పెచ్చులూడి పడుతున్నాయని అంటున్నారు. అధికారులు వెంటనే ఇక్కడి పరిస్థితులపై స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

సంపత్ వినాయకునికి ప్రత్యేక పూజలు



పరవాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : వాడచీపురుపల్లి పంచాయతీ పందివానిపాలెంలో సంపత్ వినాయక ఆలయ మూడో వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవగ్రహ సహిత గణపతి లక్ష్మీ హోమం, వినాయకుని కల్యాణాన్ని వేదపండితులు జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా వీరాంజనేయ తీర్థం



సబ్బవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఆరిపాక శివారు చినయాతపాలెంలో వీరాంజనేయ తీర్థాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి స్వామివారికి పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. రాత్రి నిర్వహించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గ్రామ పెద్దలు మల్ల దుర్గి నాయుడు, కోటేశ్వరరావు, బాలాజీ, పెద రాము నాయుడు, వెంకునాయుడు తదితరులు స్వామిని దర్శించుకున్నారు. నిర్వాహకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు పరవాడలో వేడుక

పరవాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పరవాడ సీతారామ కళ్యాణ మండపం వద్ద శనివారం చుక్క అక్కులు తీర్థాన్ని నిర్వహించనున్నామని నిర్వాహకులు గండి నమోబాబు తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం ఆరు గంటల నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయన్నారు. రాత్రి ఏడు గంటల నుంచి కళ్యాణ మండపం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు



విద్యార్థికి కంటి పరీక్ష జరుపుతున్న వైద్యుడు

కశింకోట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు విద్యార్థులందరికీ కంటి పరీక్షలు జరిపారు. అవసరమైన వారికి అద్దాలను ఉచితంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.ఆర్.వి.అప్పారావు, శిబిరం కో-ఆర్డినేటర్ కె.ప్రసాద్, వైద్య సిబ్బంది లావణ్య, లక్ష్మి, కార్తీక్ పాల్గొన్నారు.

రహదారిపై ఫ్లైయాష్, బొగ్గు తొలగింపు



రహదారిపై బుడిదను తొలగిస్తున్న దృశ్యం

లంకెలపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెం కూడలి నుంచి ఫార్మాసిటీ రహదారిలో పేరుకుపోయిన బొగ్గు, బుడిద (ఫ్లైయాష్) తొలగింపునకు జీవీఎంసీ అధికారులు శుక్రవారం చర్యలు చేపట్టారు. నిత్యం లారీల్లో పరిమితికి మించి బొగ్గు, ఫ్లైయాష్ రవాణా చేస్తుండడంతో ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. ముందు వెళ్లే వాహనాల వేగానికి వెనుక వచ్చే ద్విచక్ర వాహన చోదకులకు కళ్లలోకి ఇవి ఎగసి పడుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య స్థానికులు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి చర్యలు చేపట్టారు. పేరుకుపోయిన బొగ్గు, బుడిదను జీవీఎంసీ సిబ్బంది ద్వారా తొలగించే పనులు చేపట్టారు.


తుఫాన్‌కు దెబ్బతిన్న గ్రావిటీ పైప్‌లైన్


పైప్ లైన్ నుంచి వస్తున్న తక్కువ నీటి ధార


గ్రామంలో పబ్లిక్ ట్యాప్‌లకు నీరు రాని దృశ్యం

కుమ్మరితోటలో తాగునీటికి కటకట

- తుఫాన్‌కు దెబ్బతిన్న గ్రావిటీ పథకం పైప్‌లైన్
- కుళాయిల నుంచి సక్రమంగా సరఫరా కాని నీరు
- పట్టించుకోని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు
- గ్రామస్థులకు అవస్థలు

సీలేరు, ఫిబ్రవరి 7, (ఆంధ్రజ్యోతి):జీకేవీధి మండల పరిధి కమ్మరితోటలో మరమ్మతులకు లోనైన తాగునీటి గ్రావిటీ పథకాన్ని పునరుద్ధరించాలని గిరిజనులు కోరుతున్నారు. గత ఏడాది సెప్టెంబరు 8వతేదీన సంబవించిన పెను తుఫాన్ ప్రభావానికి కొండచరియలు విరిగిపడి ఈ గ్రావిటీ పైప్‌లైన్ దెబ్బతినడంతో గ్రామానికి నీటి సరఫరా కావడంలేదు. పైపులు ఎక్కడికక్కడ పగుళ్లు కావడంతో నీరు వృధాఅవుతోంది. దీంతో కుళాయిలనుంచి చిన్న ధార మాత్రం వస్తోందని, గత నాలుగు నెలలుగా అరకొర నీటి సరఫరాతో ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలో 100 కుటుంబాలు ఉన్నా యని, రానున్న వేసవి కాలంలో ఈ నీరు మరింతగా తగ్గిపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామమంతా ఈ గ్రావిటి నీటి పథకంపైనే ఆధారపడి ఉన్నామని, సమీపాన ఊటగెడ్డలు గానీ, బోర్లు గానీ లేవని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ స్థితిలో రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు స్పందించి గ్రావిటీ పైప్‌లైన్ కొత్తది ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను తీర్చాలని గ్రామస్థులతోపాటు పెసా కమిటీ కార్యదర్శి కిల్లో ధర్మారావు, వార్డు సభ్యుడు కిల్లో ఆంజనేయులు, రెడ్డి లింగమూర్తి, కొట్టక్కి ప్రసాద్‌తదితరులు కోరుతున్నారు.

నిర్మాణం పూర్తయిన ఇళ్లకు వారంలోగా బిల్లులు

- జిల్లాలో 28,583 పీఎం జన్‌మన్ పక్కా గృహాలు మంజూరు
- హౌసింగ్ పీడీ బి. బాబు


లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ బాబు

చింతపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పక్కా గృహాల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారం రోజుల్లో లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తామని జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ బి. బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ లింగాలగుడి గ్రామాన్ని సందర్శించారు. లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ సకాలంలో నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. పనులు ప్రారంభించకుండగా బిల్లులు చెల్లింపులు జరగవని, నిర్మాణాలు ఆధారంగా బిల్లులను వివిధ స్థాయిలో అందిస్తామన్నారు. పునాదులు పూర్తి చేస్తే రూ.70వేలు, రూఫ్ స్థాయికి రూ.90వేలు, స్లాబ్ పూర్తి చేస్తే రూ.40వేలుతోపాటూ ఉపాధి హామీ పథకం నుంచి రూ.27వేలు, మరుగుదొడ్డికి రూ.12వేలు అందజేస్తామన్నారు. పని పూర్తి చేసిన తరువాత ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి జియోట్యాగింగ్ చేస్తేనే బిల్లులు వస్తాయన్నారు. జిల్లాలో పీఎం జన్‌మన్ పథకంలో 28,583 పక్కా గృహాలు మంజూరయ్యాయన్నారు. ఈ పథకంలో జిల్లాకు అత్యధిక సంఖ్యలో పక్కా గృహాలు మంజూరయ్యాయన్నారు. రెండు విడతల్లో 25,578 పక్కా గృహాలు మంజూరుకాగా కలెక్టర్ దినేశ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని మూడో విడతగా అదనంగా 3,005 గృహాలను మంజూరు చేశారన్నారు. ఒక్కొక్క పక్కా గృహం నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.39లక్షల నిధులను మంజూరు చేస్తోందన్నారు. పీఎంగ్రామీణ పథకం(పీఎంఏవై) పక్కా గృహాలకు రూ.1.80 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్టు వివరించారు. పక్కా గృహాలను సకాలంలో పూర్తికి ఏఈలు, వర్కుఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో ఏఈ కె. రమణబాబు, వర్కు ఇన్‌స్పెక్టర్ రాజారావు, సర్పంచి చింతర్ల సునీల్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌నగర్‌కు రోడ్డు సౌకర్యం కోసం వినతి

పెదబయలు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సీతగుంట పంచాయతీ పెదబయలులోని భగత్‌సింగ్‌నగర్ (వాటర్ ట్యాంక్ వీధి)కు రోడ్డు సౌకర్యం కల్పించాలని స్థానికులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పూర్ణయ్య, వీఆర్‌వోకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ వీధి రోడ్డు మధ్యన ఇటీవల స్థానికంగా ఉంటున్న పాస్టర్ వంపూరు శాంతరాజు కంచెవేయడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు ఆవేదన వ్యక్తంచేశారు. కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. అలాగే, రోడ్డు, తాగునీరు,డ్రైనేజీ సమస్యలతో అవస్థలు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్‌చేశారు.

చట్టాలను అతిక్రమించి హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం: సీపీఎం

పాడేరురూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ చట్టాలను ధిక్కరించి అల్లూరి జిల్లాలో కేటాయించిన హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డి మాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏజెన్సీలో 1/70 చట్టాన్ని సవరించాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలను బలపరుస్తూ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా అనంతగిరి మండలంలో హైడ్రో పవర్ ప్రాజెక్టును నవయుగ కంపెనీకి అప్పగిస్తూ క్యాబినెట్ చేసిన ఆమోదాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రైవేటు కంపెనీలకు సహజ వనరులు కట్టబెట్టడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. అనంతగిరి మండలంలో నిమ్మలపాడు మైనింగ్ లీజ్‌ను రద్దుపై సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్‌లో తీర్పు ఇ`స్తూ ప్రభుత్వానికి షెడ్యూల్డ్ ఏరియాలో లీజుకు ఇచ్చేఅధికారం లేదన్నారు. అయినా, సీఎం చంద్రబాబు ప్రభుత్వం సుప్రీం కోర్టు తీర్పులను గౌరవించకుండా అడ్డగోలుగా కేంద్ర ప్రభుత్వం ఒత్తిడికి లొంగి ప్రైవేటు సంస్థలకు ఏజెన్సీ ప్రాంత సహజ వనరులను అప్పగించడం అన్యా యమన్నారు. ఇప్పటికే 1/70 చట్టం సవరించాలని స్పీకర్ అయ్యన్న చేసిన వ్యాఖ్యలను ప్రభుత్వం బలపరుస్తూ హైడ్రో పవర్ ప్రాజెక్టును ప్రైవేటు కంపెనీలకు కేటాయించడం దా రుణమని అన్నారు. ఈ విధానాలపై పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ స భ్యులు కె.మొస్యా, ఎల్.సుందరరావు, కె.రామారావు పాల్గొన్నారు.

పీటీజీ విద్యార్థికి డాక్టరేట్ ప్రదానం


ఏయూ రిజిస్ట్రార్‌నుంచి డాక్టరేట్ అందుకుంటున్న స్వాభి సారన్స్

అరకులోయ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):ఆంధ్ర యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో చదువుతున్న గిరిజన విద్యార్థికి స్వాభి సారన్స్‌కు డాక్టరేట్ లభించింది. హెచ్‌ఆర్ఎం డిపార్టుమెంట్‌కు చెందిన ఆచార్య అరుణ కుమార్ పర్యవేక్షణలో ట్రైబల్ ఉమెన్ వర్క్సు ఇన్ కాఫీ ప్లాంటేషన్, సోషియో ఎకనామిక్ కండీషన్స్ తదితర అంశాలపై పరిశోధన చేసినందుకు ఆయనకు ఏయూ ఈ డాక్టరేట్ లభించింది. శుక్రవారం రిజిస్ట్రార్ ఆచార్య ఈ.ఎన్ ధనుంజయరావు ప్రొసిడింగ్స్ అందించి అభినందనలు తెలిపారు. విద్యార్థి సారన్స్ స్వాభి అరకులోయకు మాజీ ఎంపీపీ స్వాభి సదానందపాత్రో కుమారుడు. పీవీటీజీ తెగకు చెందిన ఆయన ఏయూ నుంచి డాక్టరేట్ అందుకోవడంపై కుటుంబ సభ్యులు , స్థానికులు అభినందనలు తెలిపారు.

నులి పురుగుల నివారణకు కృషి


సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి రాంబాబు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో నులి పురుగుల నివారణకు కృషి చేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులు ప్రత్యేక సమావేశం జరిగింది. చిన్నారులకు తప్పనిసరిగా నులి పురుగుల నివారణ బిల్లలను వేయించాలన్నారు. దీని వల్ల చిన్నారుల ఎ దుగుదలకు వీలువుతుందన్నారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సుందరరావు పాల్గొన్నారు.

గిరిజనులకు రగ్గులు పంపిణీ


గిరిజనులకు రగ్గులు పంపిణీ చేస్తున్న శాన్ చారిటీ, మాతృభూమి సేవా సంఘం ప్రతినిధులు

చింతపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబసింగి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల గిరిజనులకు రగ్గులు పంపిణీ చేసినట్టు నర్సీపట్నం శాన్ (ఎస్ఏఎన్) చారిటీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సూరిరెడ్డి అప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం లంబసింగి పంచాయతీ చక్రాయబంద, జల్లారుమెట్ట గ్రామాల్లో 450 గిరిజన కుటుంబాలకు హ్యాండ్స్ సొసైటీ సహకారంతో మాతృభూమి సేవా సంఘం, శాన్ చారిటీ చారిటీ ప్రతినిధుల రగ్గులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాతృభూమి సేవ సంఘం కార్యదర్శి, ఐ.గోపాలరావు, ప్రతినిధులు దేవ్ సురేంద్ర, తుమ్మగంటి రామ్మోహనరావు, రాజారావు, లంబసింగి మాజీ సర్పంచ్ కొర్ర రఘునాథ్ పాల్గొన్నారు.

'మన్యం బంద్‌కు సహకరించాలి'


జీపు, ఆటో యూనియన్ నాయకులకు వినతిపత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు

పాడేరురూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మన్యంలో 1/70 చట్ట సవరణపై శాసన సభాపతి అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకుండా మిన్నకుండడంపై అనుమానాలు తలెత్తుతున్నాయని ఆదివాసీ జేఏసీ జిల్లా నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అఖిల పక్షం నిర్ణయం మేరకు ఈ నెల 11, 12వ తేదీలలో చేపడుతున్న 48 గంటల మన్యం బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. శుక్రవారం పాడేరులోని ప్రైవేటు, ఆటో యూనియన్ నాయకులను కలిసి రెండు రోజులు వాహనాలను నిలుపుచేయాలని కోరారు. బస్సు సర్వీసులు నిలిపివేతపై ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అం దించామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఈ నాయకులు కె.సురేష్ కుమార్, బొంజుబాబు, రాధాకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

రూ. 4.5 కోట్లతో మత్స్యగుండం రోడ్డు నిర్మాణం


రోడ్డు నిర్మాణం

హుకుంపేట ఫిబ్రవరి 7 ఆంధ్రజ్యోతి; మండలంలోని మఠం పంచాయతీ మత్స్యగుండం వరకు తారురోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్టు మండల ఇంజనీర్ ఎస్. సంజీవరావు తెలిపారు. మఠం జంక్షన్ నుంచి మత్స్యలింగేశ్వర స్వామి వెలసిన ఆలయం వరకు ఈ బీటీ రోడ్డు పనులకు రూ. 4.5 కోట్లు పర్యాటక శాఖ అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులను ప్రభుత్వం విడుదల చేసినట్టు చెప్పారు. మత్స్యగుండంలో జరిగే శివరాత్రి ఉత్సవాల లోపు పనులు పూర్తి చేసి భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తామని ఇంజనీర్ సంజీవరావు తెలిపారు.

తూర్పు కనుమల్లో విలువైన ఔషధ మొక్కలు

- మృత్తికశాస్త్ర విభాగం శాస్త్రవేత్త జోగారావు



చింతపల్లి పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలతో జీవశాస్త్ర ఉపాధ్యాయులు

చింతపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తూర్పు కనుమల్లో విలువైన ఔషధ మొక్కలు ఉన్నాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం మృత్తిక శాస్త్ర విభాగం శాస్త్రవేత్త పి. జోగారావు తెలిపారు. శుక్రవారం పాడేరు ఐటీడీఏ పరిధిలో వివిధయాజమాన్యాల ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయులు విజ్ఞాన యాత్రలో భాగంగా స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాన్ని సందర్శించారు. శాస్త్రవేత్తలు ఉపాధ్యాయులకు స్థానిక పరిశోధన స్థానంలో జరుగుతున్న ప్రయోగాలు, ఔషధ మొక్కలు, పూలమొక్కలతోపాటు భూసార పరీక్ష కేంద్రంపై అవగాహన కల్పించారు. మృత్తిక విభాగం శాస్త్రవేత్త మాట్లాడుతూ తూర్పుకనుముల నుంచి సేకరించిన ఔషధ మొక్కలను పరిశోధన స్థానంలో సాగు చేస్తున్నామన్నారు. సేంద్రియ వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. వర్మీకంపోస్టు, కంపోస్టు ఎరువు, సేంద్రియ పద్ధతులను రైతులకు పరిచయం చేస్తున్నామన్నారు. ఇక్కడ భూసార పరీక్ష కేంద్రంలో పరీక్షలు చేయించుకుని వ్యవసాయం చేయడం వల్ల అధిక లాభాలు సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రజని, ఏటీడబ్ల్యూవో నాగజయలక్ష్మి పాల్గొన్నారు.

'1/70 చట్టం జోలికి వస్తే ఖబడ్దార్'


నినాదాలు చేస్తున్న అఖిలపక్ష నేతలు

అరకులోయ, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): 1/70 చట్టం జోలికివస్తే ఊరుకునేది లేదని అరకులోయ మండల పెసా కమిటీ ప్రతినిధులు సుంకరి ఆనంద్, ఎం.రమేశ్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో వారు మాట్లాడారు. 1/70 చట్ట సవరణపై అసంబ్లీస్పీకర్ అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలపై నిరసిస్తూ 11 ,12 వతేదీలలో నిర్వహించే రెండ్రోజులు పాటు నిర్వహించనున్న బంద్‌ను విజయవంతం చేశారు. స్పీకర్ చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టోకూరులో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం


టోకూరులో బాలిక పాఠశాలల ఆనుకుని నిర్మించిన డ్రైనేజీ

అనంతగిరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):మండలంలోని టోకూరు పంచాయతీ కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను ఆనుకుని డ్రైనేజీ వ్యవస్థ లేక గతంలో తీ వ్ర ఇబ్బంది పడే దుస్థితి నెలకొనేది. అటువైపుగా పంచాయతీ పరిధిలోకి వచ్చే 22 గ్రామాల గిరిజనులు సైతం రాకపోకలు సాగించేవారు.. స్థానికులు ఎదుర్కొంటున్న ఈ సమస్యను సర్పంచ్ కిల్లో మోస్య.. గుర్తించి ఇటీవల జడ్పీ నిధులు నుంచి రూ.8 లక్షలు, మండల పరిషత్ నుంచి రూ.3 లక్షలతో 220 మీటర్ల డ్రైనేజీ నిర్మించేందుకు ప్రత్యేక చొరవచూపారు. ఈ నిర్మాణం పూర్తయి సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు సర్పంచ్ మోస్యను అభినందించారు.. దీంతో పాటుగా ఎస్‌డీపీ నిధులు రూ. 60 లక్షలతో సచివాలయం, గుడి, శ్మశాన వాటిక, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు..

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అడ్మిషన్ల కోసం క్యాంపెయిన్


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శంకరరావు

సీలేరు, ఫిబ్రవరి 7 , (ఆంధ్రజ్యోతి): సీలేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 2024- 2025 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో కళాశా ల ప్రిన్సిపాల్ శంకరరావు ఆధ్వర్యంలో శుక్రవారం క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. కాలేజీలోని సీఈసీ, హెచ్ఈసీ వంటి ఆర్ట్స్ గ్రూప్‌లను ఎంచుకుని ఉన్నత ల క్యాలను చేరుకోవచ్చునన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన అందిస్తున్నామన్నారు. ప్రభుత్వపరంగా ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు సరఫరా చేస్తుందన్నారు. మధ్యాహ్న భోజన పథకం, ఏపీఆర్‌డీసీ, డైట్‌సెట్ ఇతర పోటీ పరీక్షలకు, స్పోర్ట్స్‌లో శిక్షణ అందిస్తామన్నారు. ఈ నేపథ్యంలో పదో తరగతి పాసైన విద్యార్థులు కాలేజీలో చేరాలని కోరారు. కాలేజీ ఎన్ఎస్ ఎస్ పీఓ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీలు ఎంపిక


పెదబయలు మండల నూతన కార్యవర్గం

పెదబయలు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి నేతృత్వంలో రాష్ట్ర కార్యాలయం పెదబయలు మండల కమిటీని ప్రకటించినట్టు ఆ పార్టీ మండల శాఖ ఇన్‌చార్జి శరభ వేమనబాబు, మండల అధ్యక్షుడు కొండపల్లి రాంబాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సీకరి పంచాయతీ పులుసుమామిడి గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆ వివరాలు తెలిపారు. ఉపాధ్యక్షులుగా బట్టి ప్ర సాద్ , కొరవంగి వీరంనాయుడు, కోడా అబ్బాయిదొర, ప్రధాన కార్యదర్శులుగా పాంగి చంటిబాబు, లకే రాజరావు, కోశాధికారిగా కోడా సోమేశ్‌కుమార్, కార్యదర్శులుగా గొల్లోరి తిరుపతి రావు, పొయిబ మత్స్యలింగం, వంతాల బాలన్న, కొర్ర నీలకంఠంలను పార్టీ అధిష్టానం నియమించినట్టు చెప్పారు. వీరు పార్టీబలోపేతానికి కృషి చేయాలని కోరారు. కేంద్రం ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

పార్టీ చింతపల్లి మండలాధ్యక్షుడిగా బాలకృష్ణ

చింతపల్లి: బీజేపీ మండలశాఖ అధ్యక్షుడిగా సాగిన బాలక్రిష్ణ ఎన్నికైనట్టు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్ల రామకృష్ణ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రెండోసారి బాలకృష్ణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పండా ఈశ్వరరావు, మర్రి సాంబా, వసుపరి భారతి, బొబ్బిలి రాజేశ్వరి, మర్రి శ్రీను, కదుళ్ల నాగమణి, మండల కార్యదర్శులుగా జాతర రాజారావు, కిముదు రాంబాబు, వానగల చిన్నతల్లి, మాతే లక్ష్మణరావు, వంకేడి రాజన్నదొర, వండలం నారాయణమ్మ, ప్రధాన కార్యదర్శిగా వంతల మహేశ్, పొటుకూరి వరుణ్‌రాజు, కోశాధికారిగా ఉల్లి రామన్న నియమితులయ్యారు. ఈకార్యక్రమంలో నాయకులు కదుళ్ల శ్రీను, గొర్ల సోమేశ్, బాలరాజు, ఉల్లి రామన్న పాల్గొన్నారు.

కార్మికులు బీమా కలిగి ఉండాలి : న్యాయమూర్తి రోహిత్


మాట్లాడుతున్న న్యాయమూర్తి రోహిత్

చింతపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కార్మికులంతా బీమా కలిగి ఉండాలని స్థానిక ప్రథమ శ్రేణి జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం న్యాయమూర్తి ఎం. రోహిత్ అ న్నారు. శుక్రవారం ప్రాం తీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో కార్మికులతో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ కార్మిక వ్యవస్థ చాలా కీలకమైందన్నారు. కార్మికులు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్మిక చట్టాలపై ప్రతి ఒకరు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్మికులు పనిదినాల్లో ఎనిమిది గంటలు మాత్రమే పనిచేయాలన్నారు. ఎక్కువ సమయం పనిచేస్తే యాజమాన్యం అదనంగా వేతనం చెల్లించాలన్నారు. కార్మిక కుటుంబాలకు విద్య, వైద్యం, ఆర్థికపరమైన రంగాల్లో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాలహుస్సేన్‌రెడ్డి, పారాలీగల్ వలంటీర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ముఖ హాజరు తప్పనిసరి: డీఈఓ


మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీ రావు

పెదబయలు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ముఖ హాజరు తప్పనిసరి అని డీఈవో పి. బ్రహ్మాజీరావు ఆదేశించారు. శుక్రవారం స్థానిక గురుకుల పాఠశాలలో ఎంఈవో కొమ్ము కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు విధుల హాజరుతో పాటు విద్యార్థుల హాజరు వివరాలను కూడా తప్పక నమోదు చేయాలని అన్నారు. అలాగే, పాఠశాలల బడ్జెట్ ప్రణాళిక (2025-2026) విద్యా సంవత్సరానికి సంబంధించి ఫార్మేటివ్ అసెస్మెంట్-3 మార్కులు, సమ్మెటివ్ అసెస్మెంట్-1 మార్కుల అప్‌లోడ్, హౌస్ హోల్డింగ్ మ్యాపింగ్ తదితర పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు, ఎంఐసీ పాల్గొన్నారు.

మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జర్జుల పంచాయతీ గుంజిరి గ్రామంలో ఈ నెల 26వ తేదీన జరగనున్న శివలింగేశ్వర స్వామి పండుగ పురస్కరించుకునిమండల స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం వైసీపీ మండల అధ్యక్షుడు పద్మారావు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల విజేతలకు బహుమతులతో పాటు నగదును అందిస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

సమన్వయంతో బాల్య వివాహాల నిరోధం

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సమన్వయంతో బాల్య వివాహాలకు అడ్డుకట్టు వేయాలని సీడీపీఓ నీలిమ అన్నారు. మండలంలోని కొర్రా పంచాయతీ కేంద్రంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రెవెన్యూ సిబ్బందితో కలిసి స్థల పరిశీలన చేశారు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు బాల సంఘల ప్రతి నిధులతో సమావేశాన్ని నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని ఆరు అంగన్‌వాడీ కేంద్రాల్లో బడి బయట పిల్లలను గుర్తించాలన్నారు. వారిని తిరిగి బడిలో చేర్పించాలన్నారు. కిశోర బాలికలకు నైపుణ్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు విజయ, పంచాయతీ,రెవెన్యూ అధికారులు రాజు, ఎస్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మన్యం బంద్‌ను విజయవంతానికి పిలుపు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : అయ్యన్న పాత్రుడు వాఖ్యలకు నిరసనగా ఈ నెల 11, 12 తేదీల్లో అఖిలపక్షం, ప్రజా సంఘాలు చేపడుతున్న మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని గిరిజనసంఘం మండల కార్యదర్శి కె.నర్సయ్య కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గిరిజనులకు గిరిజనుల మనుగడకు ఆయువుపట్టుగా ఉన్న 1/70 చట్టంపై స్పీకర్ అయ్యన్న అనుచిత వాఖ్యలకు వ్యతిరేకంగా 48 గంటల మన్యం బంద్‌లో అన్ని వర్గాల వారు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ, ఆ సంఘం నేతలు ఎం.ఎం.శ్రీను, చందు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఆదివాసీ మహిళలను కించపరిచిన ఒడిశా సీఎం రాజీనామా చేయాలి'

పాడేరురూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ మహిళలను కించపరిచేలా మాట్లాడిన ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ మజ్జి వెంటనే రాజీనామా చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఒడిశా సీఎం వ్యాఖ్యలను గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఆదివాసీ మహిళల అందాలను అవహేళన చేసిన సీఎం మోహన్ మజ్జికి ఆపదవిలో ఉండే అర్హత లేదన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.పుణ్యవతి, గిరిజన సంఘం నేత కె.త్రినాథ్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు క్రష్ ప్రొగ్రాం ప్రారంభం


బోనంగిపల్లిలో బోర్‌వెల్ మరమ్మతు చేస్తున్న కార్మికులు

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి నివారించేందుకు సమ్మర్ క్రష్ కార్యక్రమాన్ని ప్రారంభించామని స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలో గురువారం నుంచి సమ్మర్ క్రష్ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. మార్చి 15 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నా రు. ఇందులో భాగంగా మండలంలో 247 బోర్‌వెల్స్‌ను ఆపరేటర్లు తనిఖీ చేస్తారన్నారు. రక్షిత మంచి నీటి పథకాల తాజా పరిస్థితిని పరిశీలించి నివేదిక ఇస్తారన్నారు. మరమ్మతులకు గురైన బోర్‌వెల్స్ రక్షిత మంచి నీటి పథకాలను మరమ్మతులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కల్యాణ్‌రామ్ తపాల్గొన్నారు.


యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ గోవిందరావు

ర్యాష్ డ్రైవింగ్‌పై పోలీసుల కొరడా

- పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్
- ఫోన్ మాట్లాడుతూ బైక్ నడిపేవారిపై నిఘా

నర్సీపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధలను అతిక్రమిస్తున్న వారిపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న యువకులు, మైనర్ డ్రైవింగ్ చేస్తున్న వారి తల్లిదండ్రులపై చర్యలకు ఉపక్రమించారు. ఈ మేరకు మైనర్లకు వాహనాలు ఇచ్చి రోడ్డు మీదకు పంపుతున్న తల్లిదండ్రులను గుర్తిస్తున్నారు. వారితో పాటు శుక్రవారం 45 మందిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. కొంత మంది జులాయిలు మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ పాదచారులు, వాహనదారులను భయభ్రాంతులకు గురిస్తున్నారు. దీంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. పట్టణ సీఐ గోవిందరావు శుక్రవారం ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న యువకులతో పాటు వాహనాలు నడిపిన ఐదుగురు పిల్లల తల్లిదండ్రులకు స్టేషన్‌కి రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చి మరోసారి బైక్ ఇవ్వవద్దని చెప్పి పంపించారు. అలాగే సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న వారిపై నిఘా పెట్టారు. వారి ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. రెండు రోజులకోసారి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సెల్‌ఫోన్, మైనర్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నవారిపై కేసులు రాస్తామని సీఐ తెలిపారు.

పింఛన్ల నగదు ఎగవేతపై విచారణ


పోగచెట్టుపాలెంలో విచారణ చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

గొలుగొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాలికమల్లవరం గ్రామ పంచాయతీ శివారు పోగచెట్టపాలెం గ్రామంలో పింఛన్ల నగదు ఎగవేతపై శుక్రవారం అధికారులు విచారణ చేపట్టారు. ఈ నెల 1వ తేదీన పంపిణీ చేయాల్సి పింఛన్ మొత్తాన్ని పది మందికి వేలుముద్రలు పెట్టుంచుకుని ఇవ్వలేదని డీఆర్‌డీఏ పీడీకి ఫిర్యాదు అందింది. ఈ మేరకు జోగంపేట సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ చంద్రశేఖర్‌పై తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో మేరీరోజ్, ఇతర అధికారులు విచారణ చేశారు. వేలుముద్రలు వేయించుకుని నగదు ఇవ్వలేదని వారంతా అధికారులకు తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ విచారణకు అందుబాటులో లేకపోవడంతో విధులకు గైర్హాజరైనట్టు గుర్తించారు. ఈ నివేదకను డీఆర్‌డీఏ పీడీకి అందిస్తామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్ఐ కొండబాబు పాల్గొన్నారు.

వ్యాయామంతోనే గుండెకు భరోసా


పేదల గుండెకు భరోసా కరపత్రాలను ఆవిష్కరించిన వైద్యులు

కె.కోటపాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వ్యాయామంతోనే గుండెకు భరోసా లభిస్తుందని 50 పడకల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం పేదల గుండెకు భరోసా కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడుతూ ఛాతి నొప్పి రావడంతో పాటు ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం గుండెపోటు లక్షణాలు కావచ్చని చెప్పారు. గుండెపోటు లక్షణాలను గుర్తించిన మొదటి గంటలోపు 108కి ఫోన్ చేస్తే దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తీసుకువెళ్లి 'టెనెక్టేప్లెస్' ఇంజక్షన్‌ను ఉచితంగా ఇచ్చి ప్రాణాలను కాపాడతారని తెలిపారు. గుండెపోటుకు కారణమయ్యే కొన్ని జంక్‌ఫుడ్స్‌ను తినవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ సురేంద్ర, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తాతయ్యబాబు జన్మదిన వేడుకలు


పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది గ్రామంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు జన్మదిన వేడుకలను శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. రోగులకు పాలు, పండ్లు రొట్టెలు అందించారు. స్థానిక శివాలయం, చర్చి, మసీదుల్లో వారు ప్రార్థనలు, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వడ్డాది అధ్యక్షుడు దొండా నరేశ్, నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, శంకర్, సింగంపల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా వేదిక


ప్రజావేదికకు హాజరైన మండల స్థాయి అధికారులు

చీడికాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసమే ప్రజా వేదిక కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదని మండల ప్రత్యేకాధికారి కేవీఎల్ఎన్.మూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రజావేదిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికి ఒక రోజు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. కాగా, అప్పలరాజుపురం భూ సమస్యపై గ్రామానికి చెందిన లెక్కల ఈశ్వరమ్మ ఫిర్యాదు చేయగా, ప్రత్యర్థుల భూముల వివరాలు తీసుకు రాకపోవడంతో వాయిదా వేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హేమసుందర్రావు, ఆర్ఐ రామారావు, ఏఎస్ఐ నాగేశ్వరరావు, వీఆర్‌వో మూర్తి పాల్గొన్నారు.

కరెంట్ కష్టాలు తీరేదెన్నడో..?

- చోడవరం వినియోగదారులను వేధిస్తున్న సమస్యలు
- విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు
- కొత్త సబ్ స్టేషన్ మంజూరైనా మొదలుకాని పనులు
- వివాదంలో నరసయ్యపేట సబ్ స్టేషన్ స్థలం
- వేసవి నాటికి సిద్ధం కాకపోతే ప్రజలకు ఇక్కట్లే

చోడవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రానికి మంజూరైన 33 కేవీ సబ్ స్టేషన్ పనులు పట్టాలెక్కకపోవడంతో ఈ వేసవిలోనూ కరెంటు కష్టాలు తప్పవన్న ఆందోళన విద్యుత్ వినియోగదారులను వేధిస్తోంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మంజూరైన నరసయ్యపేట విద్యుత్ సబ్ స్టేషన్‌కు వైసీపీ ప్రభుత్వం సకాలంలో భూమిని అప్పగించకపోవడంతో సబ్ స్టేషన్ ప్రతిపాదనలకే పరిమితమైంది. చివరి దశలో ఈ సబ్ స్టేషన్‌కు స్థలం ఎంపిక చేసి సిద్ధం చేసినప్పటికీ నిర్మాణానికి బ్రేకులు పడ్డాయి. దీంతో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం అసలు ప్రారంభమవుతుందా? అనే సందేహాలు మొదలయ్యాయి.

చోడవరం ప్రాంతంలో అదనంగా నరసయ్యపేట వద్ద 33 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తే చోడవరంతో పాటు పరిసర పంచాయతీల విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం ఉంటుందన్న ఉద్దేశ్యంతో ఎనిమిదేళ్ల క్రితం అప్పటి టీడీపీ హయాంలో పట్టణ శివారు నరసయ్యపేట వద్ద రెండో 33 కేవీ సబ్ స్టేషన్ మంజూరైంది. అప్పట్లో ఈ విద్యుత్ సబ్ స్టేషన్‌కు సమకూర్చిన స్థలం చెరువు గర్భం కావడంతో అనుమతి లేక నిర్మాణం నిలిచిపోయింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నరసయ్యపేట సర్పంచ్ సబ్‌స్టేషన్‌కు అవసరమైన స్థలంతో పాటు సబ్‌స్టేషన్‌కు వెళ్లేందుకు రహదారి కూడా సిద్ధం చేశారు. 2024 మార్చి నాటికి నరసయ్యపేటలో సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తామంటూ ఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రకటన కూడా చేశారు. అయినప్పటికీ సబ్ స్టేషన్ నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. ఈలోగా సబ్ స్టేషన్ వ్యవహారం పక్కకు పోయింది.

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సబ్ స్టేషన్‌కు సిద్ధం చేసిన స్థలంపై స్థానికంగా వివాదం తలెత్తడంతో ఈ నిర్మాణం ఇపుడు ప్రశ్నార్థకంగా మారింది. దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వలేదన్న చందంగా ప్రభుత్వం సబ్ స్టేషన్ మంజూరు చేసినా, అది కార్యరూపం దాల్చకపోవడంతో పట్టణ వాసుల్లో ఆందోళన రేగుతోంది.

ఒకే సబ్ స్టేషన్‌తో ఎనలేని విద్యుత్ కష్టాలు

చోడవరానికి ఆనుకుని ఉన్న గాంధీగ్రామం, నరసయ్యపేట, అంకుపాలెం, శ్రీరాంపట్నం, గౌరీపట్నం, రేవళ్లు, పీఎస్‌పేట, ఖండేపల్లి, దాముునాపల్లి, మైచర్లపాలెం, లక్ష్మీపురం పంచాయతీలకు చోడవరం సబ్ స్టేషనే ఆధారం. చోడవరంలోని 11 వేల కనెక్షన్లకు తోడు ఆయా పంచాయతీల్లోని తొమ్మిది వేల విద్యుత్ కనెక్షన్ల భారం కూడా ఒకే ఒక్క 33 కేవీ సబ్ స్టేషన్‌పై ఉండడంతో వేసవి కాలంలో కరెంటు కోతలు తప్పడం లేదు. సబ్ స్టేషన్‌పై విపరీతమైన లోడు పడిపోవడంతో తరచూ సబ్‌స్టేషన్ ట్రిప్ అయి ఆగిపోతోంది. గంటల తరబడి సరఫరా నిలిచిపోయి స్థానికులు రేయింబవళ్లు తేడా లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. ఎంతో కాలంగా విద్యుత్ కష్టాలు అనుభవిస్తున్న స్థానికులు సబ్ స్టేషన్ మంజూరుకావడంతో ఈ ఏడాదైనా తమ కష్టాలు తీరుతాయని ఆశలు పెట్టుకున్నారు. చివరి దశలో పనులకు ఆటంకం కలుగుతుండడంతో మళ్లీ తమకు కష్టాల భారం తప్పదేమోనన్న నిస్పృహలోకి జారుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే వీలైనంత త్వరగా జోక్యం చేసుకుని విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం జరిగేలా చొరవ చూపించాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


చీడికాడ రోడ్డులో ఉన్న ఈ సబ్ స్టేషన్‌పైనే మొత్తం భారం పడేది..!

త్వరలో సబ్ స్టేషన్ పనులు చేపడతాం

-యు.కుమార్ గౌరీప్రసాద్, ఏడీఈ. ఈపీడీసీఎల్, చోడవరం

నరసయ్యపేటలో విద్యుత్ సబ్‌స్టేన్‌కు రూ.3 కోట్లు మంజూరయ్యాయి. సబ్ స్టేషన్‌కు స్థలాన్ని కేటాయిస్తూ రెవెన్యూ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. వీటికి టెండరు కూడా ఖరారైంది. త్వరలోనే పనులు చేపడతారు. పనులు పూర్తయితే విద్యుత్ సమస్యలు ఉండే అవకాశం ఉండదు.

ఉపాధి పనుల నాణ్యతను మేట్‌లు పర్యవేక్షించాలి

- ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ మణికుమార్

రావికమతం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పనులను మేట్‌లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ అనకాపల్లి క్లస్టర్ ఏపీడీ మణికుమార్ ఆదేశించారు. మండలంలో కవ్వగుంట గ్రామ కొత్త చెరువులో ఉపాధి పథకంలో జరుగుతున్న పూడిక తీత పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలుగు పట్టి మట్టి తవ్వారు. అనంతరం ఏపీడీ మాట్లాడుతూ ఒక మేట్ 25 కుటుంబాల వారు చేపట్టే పనుల బాధ్యతను తీసుకోవాలని, వారితో పనులు నాణ్యంగా చేయించాలని సూచించారు. గతంలో మాదిరిగా ఉపాధి పనుల్లో ఏ మాత్రం డొల్లతనం కనిపించినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఉపాధి వేతనదారులకు కూలి రేటు ప్రభుత్వం పెంచి, నాణ్యమైన పనులు జరిగేలా చర్యలు చేపట్టిందన్నారు. ఇకపై తూతూమంత్రంగా పనులు చేపట్టేదానికి స్వస్తి పలికి, నాణ్యమైన పని చేస్తేనే రోజు రూ.300 కూలి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. అలాగే ఉపాధి పథకంలో చేసే పనులు రైతులకు ఉపయోగ పడే విధంగా చూసుకోవాలని చెప్పారు. ఇక్కడ జరుగుతున్న పనులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కవ్వగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి, టీఏ కొండాజీ తదితరులు పాల్గొన్నారు.


కవ్వగుంటలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ మణికుమార్

రోడ్డు పనులు పూర్తయ్యేవరకు లారీలను వదలం

- ఆర్డీవోకు మూడు పంచాయతీల సర్పంచులు, ప్రజల సుస్పష్టం

మాకవరపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అధిక లోడుతో వస్తున్న లారీల వల్ల రోడ్డు మరమ్మతులకు గురికావడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయని మూడు గ్రామాల సర్పంచులు, ప్రజలు స్పష్టం చేశారు. ఈ మేరకు లారీలను అడ్డుకుని వారు చేపడుతున్న ఆందోళనక కార్యక్రమం కొనసాగుతోంది. మూడో రోజు శుక్రవారం ఆర్డీవో వీవీ.రమణ, తహసీల్దార్ టెంట్ వద్దకు వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. దీంతో సందర్భంగా శెట్టిపాలెం, భీమబోయినపాలెం, జెడ్.గంగవరం పంచాయతీల సర్పంచులు అల్లురామునాయుడు, నంద కిశోర్, దుంగల రమణ మాట్లాడుతూ రోడ్డు పనులు ఎప్పుడు మొదలుపెడితే అప్పుడే బంధించిన లారీలను వదలిపెడతామని తెగేసి చెప్పారు. అనంతరం 15 డిమాండ్లతో కూడిన వినతిపతాన్ని అధికారులకు అందజేశారు. వాటిలో ప్రధానంగా వెంకన్నపాలెం, జడ్.గంగవరం, శెట్టిపాలెం, భీమబోయినపాలెం గ్రామాలకు చెందిన నాలుగు కిలోమీటర్ల రోడ్డును పెంచాలని, భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు కల్పించాలని, ప్రతి గ్రామంలోనూ ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని, నాలుగు గ్రామాల్లోని రహదారుల ప్రధాన కూడళ్లల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. దీనికి ఆర్డీవో స్పందిస్తూ డిమాండ్లను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తానని చెప్పారు. అనంతరం రోడ్డు ట్రాన్స్‌పోర్టు యాజమాన్యం కూడా వచ్చి చర్చలు జరిపారు. ఏదేమైనా రోడ్డు పనులు మొదలుపెడితేనే లారీలను వదిలిపెడతామని వారు భీష్మించడంతో, చేసేది వెనక్కి వెళ్లిపోయారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, నాయకులు అడిగర్ల శ్రీను, రుత్తల జమీందార్, చినబాబు, బుచ్చిరాంప్రసాద్, బీజేపీ నేత రాంబాబు పాల్గొన్నారు


ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న మూడు గ్రామాల సర్పంచులు, ప్రజలు

అఘాయిత్యాలపై వెంటనే స్పందించండి

విద్యాలయాల్లో బాలికలకు ఐసీడీఎస్ అధికారుల అవగాహన

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థలు, మరేతర ప్రాంతాల్లోనైనా అఘాయిత్యాలు జరిగితే భయపడకుండా వెంటనే స్పందించాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి మంజులవాణి సూచించారు. శుక్రవారం వడ్డాదిలోని ప్రభుత్వ హైస్కూల్, కేజీబీవీ విద్యా సంస్థల్లో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసుల సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబరు 0892-293294కు ఫోన్ చేయాలని సూచించారు. ఎంఈవో బొంజుబాబు మాట్లాడుతూ విద్యార్థినులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి లేదా పోలీసుల దృష్టికి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పుష్పవతి, కౌన్సిలర్ ఝాన్సీరాణి, టీడీపీ నేత దొండా నరేశ్, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ కోవెల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మాడుగులలో విద్యుత్ పనులు

మాడుగుల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం మాడుగులలో శుక్రవారం విద్యుత్ పనులు నిర్వహించారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏఈ రాంబాబు పర్యవేక్షణలో లైన్‌ఇన్‌స్పెక్టర్ అప్పచ్చిబాబు గ్రామంలో ఈ పనులు చేపట్టారు. వేసవికాలంలో విద్యుత్ అధిక వాడకం కారణంగా లోడు పెరిగి లోవోల్టేజీ సమస్యను దృష్టిలో పెట్టుకొని లోడ్ భారం అధికంగా ఉన్నచోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో శుక్రవారం ప గ్రామాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది.

కొత్తకోట కిరాణా దుకాణంలో చోరీ

రావికమతం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఓ కిరాణా దుకాణంలో చోరీ జరిందీ. కొత్తకోట మెయిన్ రోడ్డులోని గెల్లి చెలపతికి చెందిన దుకాణం పైకప్పు పెంకులను గురువారం రాత్రి దొంగలు తొలగించి లోపలకు చొరబడ్డారు. విలువైన వస్తువులు, నగదు దొంగించుకుపోయారు. ఈ చోరీపై కొత్తకోట ఎస్ఐను వివరణ కోరగా చోరీ చేసిన దొంగను పట్టుకునే ప్రయత్నంలో ఉన్నామని చెప్పారు.

నేత్రపర్వంగా ఆంజనేయస్వామి తీర్థం

చీడికాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అప్పలరాజుపురం గ్రామంలో శుక్రవారం అభయాంజనేయస్వామి తీర్థం నేత్రపర్వంగా జరిగింది. భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, జిల్లా కార్యదర్శి గవిరెడ్డి జగన్నాథం, నాయకులు కె.సురేశ్, జి.శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పలు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


తీర్థ మహోత్సవంలో కళాకారుల నృత్య ప్రదర్శన

క్వారీ లారీ ఢీకొని విద్యుత్ స్తంభాలు నేలమట్టం

రోలుగుంట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొవ్వూరు గ్రామంలో గురువారం అర్ధరాత్రి క్వారీ లారీ విద్యుత్ స్తంభాలను ఢీకొట్టడంతో మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గ్రామంలో అంధకారం అలముకోవడంతో అర్ధరాత్రి యువకులు, ప్రజలు పెద్దఎత్తున రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. అయినా శుక్రవారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదు. వడ్డిప సమీపంలో ఉన్న క్వారీ నుంచి నిత్యం ఈ గ్రామం మీదుగా అధిక బరువుతో కూడిన రాళ్లను రాంబిల్లి నావెల్‌బేస్‌కు తరలిస్తున్నారు. గతంలో పలుమార్లు స్కూల్ పిల్లల బస్సులను స్వల్పంగా ఢీకొట్టిన ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


నేలమట్టమైన విద్యుత్ స్తంభం

సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం

మాకవరపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లచ్చన్నపాలెంలో శుక్రవారం సీతారాముల విగ్రహాల పత్రిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇటీవల రూ.50 లక్షలతో గ్రామంలో నూతనంగా రామాలయం నిర్మించారు.ఈ రామాలయంలో వారం రోజులుగా పూజలు నిర్వహించి శుక్రవారం విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. శనివారం రామాలయాన్ని ప్రారంభిస్తామని గ్రామ టీడీపీ నాయకుడు పోతల రాంబాబు అన్నారు.


రామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ చేస్తున్న దృశ్యం

వైభవంగా అడివిరాజులుబాబు పండగ

మాకవరపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అడివిరాజులుబాబు పండగను వైభవంగా నిర్వహించారు. ప్రజలు ర్యాలీగా వెళ్లి పూజలు చేశారు. ఈ ర్యాలీలో డాన్సులు, భజనలు ఆకట్టుకున్నాయి. అలాగే ఎరకన్నపాలెం, రామన్నపాలెం, భీమబోయినపాలెం, శెట్టిపాలెం, వెంకన్నపాలెం, చినరాచపల్లి, జి.వెంకటాపురం తదితర గ్రామాల్లో అడివిరాజులుబాబు పండగను ఘనంగా నిర్వహించారు.

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట అల్లూరిపార్కు వద్ద గల అడవిరాజులుబాబు పండగ శుక్రవారం అత్యంతవైభవంగా నిర్వహించారు.. ఈ ఆలయ నిర్మాణ ధర్మకర్త కొమ్మనాపల్లి రామారావు ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల్లో ఊరేగింపు సంబరాన్ని చేశారు. అనంతరం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, తలనీలాలు, తదితర మొక్కులు తీర్చుకున్నారు. కృష్ణాదేవిపేట గ్రామంతో పాటు కొయ్యూరు, గొలుగొండ, నాతవరం, చింతపల్లి తదితర మండలాల నుంచి భక్తులు తరలివచ్చి పండగలో పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ నిర్మూలనకు సహకరించండి

- సీనియర్ సివిల్ జడ్జి గౌరీశంకరరావు

చోడవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వెట్టిచాకిరి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు వి.గౌరీశంకరరావు సూచించారు. శుక్రవారం పట్టణంలోని వ్యాపారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెట్టిచాకిరీని ప్రోత్సహించవద్దని, వెట్టిచాకిరీకి దూరంగా ఉంటామని వ్యాపారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది కొలగాని సతీశ్, వాసవీ కిరాణా మర్చంట్ అసోసియేషన్ కార్యదర్శి ఉప్పల నాగేశ్వరరావు, గుప్తా, వ్యాపారులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో గౌరీదేవి పండుగ

నర్సీపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చెట్టుపల్లి గ్రామంలో గౌరీదేవి ఉత్సవాలు, పైడితల్లమ్మ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని రూరల్ సీఐ రేవతమ్మ సూచించారు. చెట్టుపల్లి గ్రామ పెద్దలతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. పండగ సందర్భంగా కోడి పందేలు, జూదం నిర్వహించడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. కోడి పందేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టేజీ కార్యక్రమాలకు పోలీసు అనుమతి ఉండాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గజాల సూరిబాబు, వై.పాపారావు, పూడి చక్రవర్తి పాల్గొన్నారు.

సామరస్యంగా సివిల్ తగాదాలు పరిష్కరించుకోండి

నాతవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వివాదాలకు పోకుండా స్థానికంగానే సివిల్ తగదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని మండల ప్రత్యేక అధికారి నాగశిరీషా సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. వివిధ గ్రామాల నుంచి సివిల్ తగదాలతో వచ్చిన వారితో ఆమె విడివిడిగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగటం వల్ల విలువైన సమయాన్ని కోల్పోతున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సివిల్ తగదాలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఇన్‌చార్జి ఎంపీడీవో పార్థసారథి, ఎస్ఐ సిహెచ్.భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ ఆలయం ప్రారంభోత్సవం

దేవరాపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముషిడిపల్లి గ్రామంలో దుర్గాలమ్మ ఆలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోమిరెడ్డి గోవింద, భారత చైతన్య యువజన పార్టీ సమన్వయకర్త నమ్మి అప్పలరాజు, నాయకులు బొడ్డు వెంకటరావు, మొల్లి కృష్ణమూర్తి, ఎన్.అప్పారావు, మొల్లి గంగునాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి చేసిన ఉపాధ్యాయుడిని శిక్షించాలి

చోడవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బుచ్చెయ్యపేట మండలం వడ్డాది నేషనల్ టాలెంట్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన ఉపాధ్యాయుడిని శిక్షించాలని పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు నందారపు భాస్కర్ డిమాండ్ చేశారు. అలాగే స్కూల్ అనుమతులు కూడా రద్దు చేయాలని కోరారు. ట్యూషన్లు, స్పెషల్ క్లాసుల పేరుతో ఆడపిల్లలను రాత్రి వరకూ ఉంచడం, తెల్లవారుజామున పాఠశాలకు రప్పించడం వంటి చర్యలకు పాల్పడుతున్న యాజమాన్యాలపై విద్యా శాఖ మంత్రి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మేడివాడలో నీలగిరి తోట దగ్ధం

రావికమతం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగల రాపిడి కారణంగా ఎగిసిపడ్డ నిప్పు రవ్వలతో నీలగిరి తోట దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని మేడివాడ శివారులో శుక్రవారం జరిగింది. మేడివాడ నుంచి అప్పలమ్మపాలెం వెళ్తున్న 11కేవీ విద్యుత్ లైన్‌కు చెందిన వైర్లు రాపిడికి గురై నిప్పు రవ్వలు ఎగిసి దేవుడు పొలంలోని నీలగిరి తోటపై పడ్డాయి. దీంతో తోటలో ఎండిన ఆకులుకు రాజుకుని మంటలు చెలరేగి రెండు ఎకరాల్లో తోటలు దగ్ధమయ్యాయి. దీంతో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రమాద సమాచారం తెలుసుకున్న రావికమతం అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

అరుదైన నాగకేసరి వృక్షాలను చూసొద్దాం రండి..



బంగారంగరువు గ్రామ సమీపంలోని నాగకేసరి చెట్లున్న ప్రాంతం డ్రోన్ వ్యూ

(పాడేరు/హుకుంపేట- ఆంధ్రజ్యోతి)

అరుదైన వృక్షాలను చూడాలంటే జిల్లాలోని పాడేరు డివిజన్ పరిధి హుకుంపేట మండలంలోని దుర్గం పంచాయతీ బంగారంగరువు గ్రామానికి వెళ్లాల్సిందే. ఇక్కడి అరుదైన నాగకేసరి వృక్షాల ఆకులు రంగులు మారుతుంటాయి. ప్రస్తుతం ముదురు ఎరుపు, లేత గులాబీ రంగుల్లో ఈ చెట్ల ఆకులు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. దీంతో ఈ చెట్ల వద్ద ఫొటోలు దిగేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. పలువురు ఇక్కడికి కుటుంబాలతో పిక్నిక్‌కి వస్తుంటారు. యువత స్నేహితులతో ఇక్కడ సందడి చేస్తుంటారు. ఆయా వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చాలా ఏళ్ల తరువాత ఆ వృక్షాలు మరోమారు చర్చకు వచ్చాయి.

- 'ఉప్ప చెట్లు'గా పిలుస్తున్న స్థానిక గిరిజనులు
- ప్రస్తుతం ముదురు ఎరుపు, గులాబీ రంగుల్లో ఉన్న చెట్ల ఆకులు
- నెల రోజుల తరువాత మరో రంగులోకి..
- పిక్నిక్ స్పాట్‌గా గుర్తించి తరలివస్తున్న సందర్శకులు
- పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలని స్థానికుల వేడుకోలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేవలం హుకుంపేట మండలం బంగారంగరువు గ్రామ సమీపంలో మాత్రమే లభ్యం



నాగకేసరి చెట్లను తిలకిస్తున్న పర్యాటకులు



లేతగులాబీ రంగులో ఉన్న చెట్ల ఆకులు

బంగారంగరువులో మాత్రమే ప్రత్యక్షమయ్యే అరుదైన చెట్లు

ప్రస్తుతం ముదురు ఎరుపు, లేత గులాబీ రంగు ఆకులతో ఆకర్షణీయంగా ఉన్న ఆ చెట్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేవలం హుకుంపేట మండలం బంగారంగరువు గ్రామ సమీపంలో సుమారు 16 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. అవి ఎలా వచ్చాయి?, ఎప్పుడు వచ్చాయనేది ఎవరికి తెలియకపోగా వాటి శాస్త్రీయ నామం మాత్రం 'నాగకేశరి'గా అటవీ అధికారులు తెలిపారు. అయితే ఆయా చెట్లు ఉప్ప పంచాయతీ కేంద్రానికి సమీపంలో ఉండడంతో స్థానిక గిరిజనులు మాత్రం వాటని 'ఉప్ప చెట్లు'గా పిలుస్తున్నారు. రెండు దశాబ్దాల క్రితమే ఆంధ్రా యూనివర్సిటీ బొటానికల్ విభాగం, రాజమహేంద్రవరంలోని అటవీ శాఖ పరిశోధనా స్థానం అధికారులు వాటిపై అనేక పరిశోధనలు చేశారు. కానీ వాటి గురించి సరైన సమాచారాన్ని రాబట్టలేకపోయారు. అలాగే ఆ చెట్లు కేవలం ఆ ప్రదేశంలో మినహా ఎక్కడ నాటినా మొలవకపోవడంతో పాటు రాష్ట్రంలో మరో ప్రదేశంలో లేకపోవడం విశేషం. అయితే వాటి గింజలకు ఔషధ గుణాలు, నూనె స్వభావం ఉండడంతో స్థానిక గిరిజనులు వాటిని సేకరించి నూనె తీసి చర్మ వ్యాధులు వచ్చినప్పుడు వినియోగిస్తున్నారు.

పిక్నిక్ స్పాట్‌గా పెరుగుతున్న ఆదరణ

నాగకేశరి చెట్లున్న ప్రదేశం ప్రస్తుతం పిక్నిక్ స్పాట్‌గా ఆదరణ పెరుగుతున్నది. దీంతో వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు వీకెండ్‌లో అధిక సంఖ్యలో వస్తున్నారు. ప్రస్తుతం ముదురు ఎరుపు, లేత గులాబీ రంగుల్లో ఉన్న చెట్ల ఆకులు మరో నెల రోజుల తరువాత పూర్తిగా ఆకుపచ్చ రంగులో మారతాయని, అదే క్రమంలో తైల వర్ణంలో పూలు పూస్తాయని అప్పుడు చెట్లు ఆకుపచ్చ, తెలుపు రంగుల్లో ఆకట్టుకుంటాయని స్థానికులు తెలిపారు. అయితే అధిక శాతం మంది ప్రస్తుతం ఆకులున్న రంగుల్లోనే ఇష్టపడుతున్నారని పలువురు అంటున్నారు. అలాగే ఆయా చెట్ల మధ్యలో రాకెట్‌ను పోలిన ఒక భారీ వృక్షం సైతం పర్యాటకుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్నది. అధికారులు స్పందించి ఈ చెట్లున్న ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే తమకు మేలు జరుగుతుందని బంగారంగరువు గిరిజనులు అంటున్నారు.

క్రైం... crime news

అప్పులబాధతో ఉరేసుకొని ఆత్మహత్య



వేముల దుర్గాప్రసాద్ (ఫైల్ ఫొటో)

కశింకోట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కశింకోట పూసర్ల వీధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ రమణమ్మ తెలిపిన వివరాలిలా వున్నాయి. ఎన్టీఆర్ జిల్లా మైలవరానికి చెందిన వేముల దుర్గాప్రసాద్ (25) అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మా సిటీలోని లారస్ ల్యాబ్స్‌లో రోజువారీ కార్మికునిగా పని చేస్తున్నాడు. మూడేళ్ల క్రితం కశింకోటకు చెందిన యమున దుర్గా మహేశ్వరిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ప్రస్తుతం రెండేళ్ల కుమారుడు వున్నాడు. కాగా సొంతూరులో తన సోదరుడితో కలిసి ఉమ్మడిగా ఇంటిని నిర్మించుకున్నాడు. ఈ క్రమంలో అప్పులు చేయాల్సి వచ్చింది. అప్పులు తీర్చలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న దుర్గాప్రసాద్ గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకుముందు సెల్ఫీ వీడియో తీసి కుటుంబ సభ్యులకు పంపాడు. మృతుని తల్లి వేముల ఆలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

కొత్తూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బవులవాడ గ్రామ సమీపంలో ఉన్న రిక్షా కాలనీలో 2023లో జరిగిన రెండు చోరీ కేసులను అనకాపల్లి రూరల్ పోలీసులు ఛేదించారు. ఈ చోరీలకు పాల్పడిన సిమ్మ నాగరాజును శుక్రవారం బవులవాడ సమీపంలో అరెస్టు చేశారు. నిందితుడి నుంచి అరెస్టు చేసి ముప్పావు తులం బంగారం, రూ.20 వేల నగదు రికవరీ చేసినట్టు ఎస్ఐ జి.రవికుమార్ తెలిపారు.

అధిక లోడు వాహనాలకు జరిమానా

తుమ్మపాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తుమ్మపాల మెయిన్‌రోడ్డులో శుక్రవారం అధిక లోడుతో వెళుతున్న రెండు భారీ వాహనాలను గుర్తించి జరిమానా విధించినట్టు ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ చెప్పారు. పోలీసు సిబ్బంది గుండాల జంక్షన్ వద్ద వాహనాలను తనికీ చేస్తున్నారని, ఈ సమయంలో పరిమితికి మించి లోడుతో వెళుతున్న రెండు వాహనాలను నిలుపుదల చేశారని తెలిపారు. అనంతరం వాహనాల రికార్డులను, డ్రైవర్లను జిల్లా రవాణా శాఖ అధికారి ఎదుట హాజరుపరచగా ముందు హాజరుపరచడం జరిగిందన్నారు. ఓవర్‌లోడుతో రాకపోకలు సాగిస్తున్నాయని నిర్ధారణ చేసిన ఆర్టీవో రెండు వాహనాలకు రూ. లక్షా 24 వేలు జరిమానా విధించారని ఆయన చెప్పారు.

96 మద్యం సీసాలు స్వాధీనం



పోలీసులు పట్టుకున్న మద్యం సీసాలు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అనధికారికంగా తరలిస్తున్న మద్యం సీసాలను పట్టణ పోలీసులు పట్టుకున్నారు. వీటికి సంబంధించి ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపిన సమాచారం మేరకు.. స్థానిక బారువారివీధి న్యూకాలనీకి చెందిన యాదగిరి శ్రీనివాసరావు ఒక అట్ట పెట్టెతో చోడవరం బస్టాప్ వద్ద ఉండగా అటుగా వెళుతున్న పోలీసులకు అనుమానం వచ్చింది. అతని వద్దకు వెళ్లి అట్ట పెట్టను తనిఖీ చేయగా 96 మద్యం (క్వార్టర్) సీసాలు బయటపడ్డాయన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, మద్యం సీసాలను సీజ్ చేశారు. ఎస్ఐ డి.ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

22 మద్యం సీసాలు స్వాధీనం, ఇద్దరి అరెస్టు

మునగపాక, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా మద్యం సీసాలను రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. మండలంలో రామగిరి శివారు ప్రాంతంలో 12 మద్యం సీసాలను తీసుకెళుతున్న గొలగని చౌడయ్యను అరెస్టు చేశామని, అదే విధంగా వాడ్రాపల్లిలో పది సీసాలుతో మరొకరిని పట్టుకొని కేసు నమోదు చేశామని చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్లాస్టిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సంస్థ (సీఐపీఈటీ), సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ), జాతీయ చిన్న తరహా పరిశ్రమల సంస్థ (ఎన్ఎస్ఐసీ) సంయుక్త ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో కూడిన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సీపీఈటీ డైరెక్టర్ సీహెచ్.శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ హబ్ స్కీమ్ ద్వారా మెషిన్ ఆపరేటర్ - ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్‌లో ఐదు నెలలపాటు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. మొదటి బ్యాచ్‌లో 30 మందికి మాత్రమే ప్రవేశానికి అవకాశం వుందని, శిక్షణ అనంతరం అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, హోసూరు, చెన్నై ప్రాంతాల్లో ప్రముఖ ప్లాస్టిక్, అనుబంధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. శిక్ష కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం వుంటుందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 18 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సీపీఈటీ ప్రతినిధి అంజినాయక్ (78935 86494)కు ఫోన్ చేసిసంప్రదించాలన్నారు.

ఆ ప్రైవేటు హైస్కూల్ అనుమతులు రద్దు చేయాలి

- ఎస్ఎఫ్ఐ డిమాండ్.. వడ్డాదిలో ఆందోళన



వడ్డాదిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన లెక్కల ఉపాధ్యాయుడు పనిచేస్తున్న నేషనల్ టాలెంట్ హైస్కూల్ అనుమతి రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ డిమాండ్ చేశారు. స్థానిక వడ్డాది హైస్కూల్‌లో విద్యార్థిని పట్ల జరిగిన అసభ్యకర ఘటనను నిరసిస్తూ శుక్రవారం మధ్యాహ్నం వడ్డాదిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా, రాత్రి పూట తరగతులు నిర్వహిస్తున్న టాలెంట్ స్కూల్ అనుమతులు రద్దు చేయాలన్నారు. బాలికలకు రక్షణ కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో ఎస్ఎఫ్ఐ నాయకులు నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం

- ఇద్దరు నిందితుల అరెస్టు, ఒకరు మైనర్
- నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు వెల్లడి



మాట్లాడుతున్న డీఎస్పీ పి.శ్రీనివాసరావు. పక్కన సీఐ అప్పన్న

పాయకరావుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గానగర్‌లోని అంబేడ్కర్ పార్కులో ఇటీవల డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈనెల ఒకటో తేదీ రాత్రి అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారన్నారు. ఈనెల 3వ తేదీన గుర్తించిన ఏఎస్‌డబ్ల్యూఓ జయలక్ష్మి ఫిర్యాదు చేయడంతో స్థానిక సీఐ జి.అప్పన్న కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారన్నారు. క్లూస్ టీమ్ సేకరించిన ఆధారాలు, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పట్టణానికి చెందిన షేక్ మెహబూబ్ బషీర్‌తోపాటు, మరో బాలుడు కారకులుగా గుర్తించి శుక్రవారం అరెస్టు చేసినట్టు చెప్పారు. వీరిని విచారించగా అంబేడ్కర్ విగ్రహాన్ని తామే ధ్వంసం చేశామని ఒప్పుకున్నారన్నారు. వీరు అంబేడ్కర్ పార్కులో తరచూ గంజాయి సేవిస్తూ ఉంటారని, ఈ క్రమంలో ఒకటో తేదీ రాత్రి పార్కులో గంజాయి సేవించి, విగ్రహాన్ని ధ్వంసం చేశారన్నారు. మెహబూబ్ బషీర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామని, బాలుడిని జువెనైల్ హోమ్‌కి తరలిస్తున్నామని చెప్పారు. విగ్రహం ధ్వంసం చేసిన సంఘటనపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, ఇంకెవరైనా వున్నట్టు నిర్ధారణ అయితే వారిని కూడా అరెస్టు చేస్తామని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను పట్టుకున్న సీఐ జి.అప్పన్న, కానిస్టేబుల్ సతీశ్, హోంగార్డ్ మదీనాలను డీఎస్పీ అభినందించారు.

మహా కుంభమేళా ప్రత్యేక రైలు పొడిగింపు

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-గోరఖ్‌పూర్ మధ్య ప్రవేశపెట్టిన ప్రత్యేక రైళ్లను కుంభమేళా ప్రయాణికుల డిమాండ్ మేరకు మరికొద్ది ట్రిప్పులు కొనసాగిస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 08588 నంబర్ గల ప్రత్యేక రైలు ఈ నెల 10, 22న రాత్రి 10.20 గంటలకు విశాఖలో బయలుదేరి 13, 25 తేదీల్లో రాత్రి 7.30 గంటలకు గోరఖ్‌పూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08587 నంబరు గల ప్రత్యేక రైలు ఈ నెల 13, 25 తేదీల్లో సాయంత్రం 5.45 గంటలకు గోరఖ్‌పూర్‌లో బయలుదేరి 15, 27 తేదీల్లో మధ్యాహ్నం 3.55 గంటలకు విశాఖ చేరుతుంది.

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా లూసీ కార్డిలియా

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్‌గా డాక్టర్ లూసీ కార్డిలియా శుక్రవారం పెదవాల్తేరులోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్‌గా పని చేసి బదిలీపై వచ్చారు. ఇక్కడి డీఐవోగా డాక్టర్ జీవనరాణి పదోన్నతిపై విజయనగరం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణిగా వెళ్లారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే



ఎస్పీ తుహిన్ సిన్హాకు సమస్యను వివరిస్తున్న హెడ్‌కానిస్టేబుల్

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ అధికారులకు ఎస్పీ తుహిన్ సిన్హా గ్రీవెన్స్ డే నిర్వహించారు. పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది పాల్గొని ఎస్పీకి తమ సమస్యలు చెప్పుకున్నారు. అనారోగ్య, ఉద్యోగపరంగా, వ్యక్తిగతంగా ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా కల్పించారు.

ఈ-క్రాప్ నమోదుకు 15 వరకే గడువు

- జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు



ఈ-క్రాప్ నమోదుపై సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

సబ్బవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : రబీ పంటలకు ఈ-క్రాప్ నమోదుకు ఈ నెల 15వ తేదీ వరకే గడువు వుందని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు చెప్పారు. ఆయన శుక్రవారం మండలంలోని మలునాయుడుపాలెంలో పర్యటించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు చేపట్టిన ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సిబ్బంది నిత్యం పొలాల్లో పర్యటిస్తూ నువ్వు, వేరుశనగ, అపరాల పంటలకు సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో పోతల సత్యనారాయణ, వీఏఏ పి.హేమలత పాల్గొన్నారు.

నాడు వారు.... ఇప్పుడు వీరు!

... 5వ పేజీ తరువాయి

గిరాకీ ఏర్పడింది. కొంతమంది అక్రమార్కులు (అధికార పార్టీతోపాటు గతంలో వైసీపీలో వుండి, ఎన్నికల్లో ఆ పార్టీ ఓడిపోయిన తరువాత కూటమి పార్టీల్లో చేరినవారు) కొండవాలు ప్రాంతాలు, ప్రభుత్వం భూముల్లో రాత్రిపూట ఎక్స్‌కవేటర్లతో గ్రావెల్ తవ్వి, డంపర్ లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. అనకాపల్లి, మునగపాక, ఎస్.రాయవరం, సబ్బవరం, పరవాడ, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల నుంచి రోజూ పెద్ద మొత్తంలో గ్రావెల్‌ను రియల్ ఎస్టేట్ వెంచర్లకు, ఇళ్ల నిర్మాణాల్లో పునాదుల మధ్యలో ఖాళీలను నింపడానికి తరలించి జేబులు నింపుకుంటున్నారు. టిప్పర్ లోడ్‌కు దూరాన్ని బట్టి రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు వసూలు చేస్తున్నారు. గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన గనులు, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

అనకాపల్లి మండలం కొండకొప్పాక, గొలగాం, మార్టూరు, తగరంపూడి, సీతానగరం, కూండ్రంగి, కుంచంగి, జంగాలపాలెం; కశింకోట మండలం అచ్చెర్ల పరిసరాలు; సబ్బవరం మండలంలో గంగవరం, నంగినారపాడు, పైడివాడ, పైడివాడ అగ్రహారం, గాలిభీమవరం గ్రామాల పరిధిలో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. స్థానికులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే గనుల శాఖ సిబ్బంది ఆ ప్రాంతాలకు వెళ్లి హడావిడి చేసి, చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నిచోట్ల తనిఖీలు జరిపారు, ఎంత మొత్తం ఫైన్ విధించారనే వివరాలను మీడియాకు వెల్లడించడం లేదు.

అవినీతి ఖజానా

... 5వ పేజీ తరువాయి

సీన్ మారిపోయింది. సస్పెన్షన్‌కు గురైన ఎస్టీవో, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు ఖజానా అండ్ అకౌంట్స్ శాఖలో భారీస్థాయిలో పైరవీలు సాగించారు. ఈ నేపథ్యంలో సస్పెన్షన్‌కు గురైన ముగ్గురు అధికారులు ఎటువంటి తప్పూ చేయలేదని విచారణలో ధ్రువీకరించడంతోపాటు వారికి నాలుగు నెలల క్రితం విశాఖపట్నంలో పోస్టింగ్ ఇచ్చారు. ఒక జిల్లా కలెక్టర్ స్వయంగా ఫిర్యాదు చేసిన వ్యవహారంలో సస్పెండైన అధికారులు ఎటువంటి తప్పు లేదని నిర్ధారించడం, విశాఖపట్నంలో పోస్టింగ్ ఇవ్వడం వెనుక భారీగా ముడుపులు చేతులు మారాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

... 5వ పేజీ తరువాయి

తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు గురువారం ఉదయం పాఠశాలకు వచ్చి, ఉపాధ్యాయుడు ప్రసాద్‌ను స్తంభానికి కట్టి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పాఠశాల వద్దకు వచ్చిన నిందితుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు కూడా పాఠశాలకు వెళ్లి వివరాలు సేకరించారు. కాగా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరిచిన అనంతరం రిమాండ్‌కు తరలించారు.

క్రషింగ్ జాప్యం.. రైతులకు శాపం

... 5వ పేజీ తరువాయి

చెరకును రైతులు తీసుకువచ్చారు. ఇంతవరకు సుమారు 60 టన్నులు మాత్రమే ఫాక్టరీకి.. అది కూడా రోజుల తరబడి ఆలస్యంగా తరలించారు. గత నెల 31వ తేదీ వరకు వచ్చిన చెరకును శుక్రవారం ఫ్యాక్టరీకి పంపారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి వచ్చిన చెరకు మొత్తం (54 బండ్లు) కాటా వద్దనే వుంది. ఇది సుమారు 170 టన్నులు వుంటుందని అంచనా. క్రషింగ్ మొదలైన తరువాత ఎంకే వల్లాపురం కాటా నుంచి 203 టన్నుల చెరకు మాత్రమే ఫ్యాక్టరీకి తోలారు. కేజేపురం కాటా వద్ద ప్రస్తుతం 45 బండ్లపై సుమారు 150 టన్నుల చెరకు ఉండిపోయింది. ఒమ్మలి కాట వద్ద 27 బండ్లలో 100 టన్నుల చెరకు ఉండిపోయింది. ఈ చెరకును ఎప్పటిలోగా ఫ్యాక్టరీకి చేరుస్తారో సిబ్బంది చెప్పలేకపోతున్నారు. ఫలితంగా చెరకు ఎండిపోయి రసనాణ్యతతోపాటు బరువు తగ్గి నష్టం వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రికి అవినీతి జబ్బు

... 5వ పేజీ తరువాయి

, మగబిడ్డ పుడితే రూ.3-5 వేలు ముక్కుపిండిమరీ వసూలు చేస్తున్నారు. ఈ అక్రమ వసూళ్లలో పైస్థాయి వారికి వాటాలు అందుతుండడంతో వైద్యాధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రసూతి విభాగంలో అక్రమ వసూళ్లపై సూపరింటెండెంట్ శ్రీనివాసరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ప్రసవం కోసం వచ్చిన వారి నుంచి సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నట్టు గతంలో ఎవరూ తన దృష్టికి తేలేదని తెలిపారు. కొంతమంది ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి, వైద్యాధికారిణిని సస్పెండ్ చేశారని చెప్పారు.

ప్రాక్టికల్ పరీక్షలకు పైసా వసూల్!

- ఒక్కో విద్యార్థి నుంచి రూ.2 వేలు...
- ప్రైవేటు కళాశాలల నిర్వాకం

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను జిల్లాలోని కొన్ని ప్రైవేటు కళాశాలలు సొమ్ము చేసుకునేందుకు రంగం సిద్ధం చేశాయి. పరీక్షల్లో ఎక్కువ మార్కులు వేయిస్తామని విద్యార్థుల నుంచి డబ్బులు పిండుతున్నాయి. కొన్ని కళాశాలలు ల్యాబ్ ఫీజుల పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ2 వేలు చొప్పున వసూలు చేస్తుండగా, మరికొన్ని రూ.5 వేల వరకు డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం.

అక్రమాలు చోటుచేసుకోకూడదనే గతంలో ప్రాక్టికల్ పరీక్షలను జంబ్లింగ్ పద్ధతిలో నిర్వహించేవారు. గత మూడేళ్లుగా ఈ విధానం రద్దు చేసి, విద్యార్థులు చదువుతున్న కళాశాలల్లోనే ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎంసెట్ ర్యాంకు కేటాయింపులో ఇంటర్ మార్కులకు వెయిటేజీ ఉండడంతో విద్యార్థులకు ప్రతి మార్కు కీలకంగా మారింది. దీనిని ఆసరాగా తీసుకుని కళాశాలల యాజమాన్యాలు ఫుల్ మార్కులు వేసేలా ఎగ్జామినర్లతో ముందస్తుగా మాట్లాడుకుంటున్నాయి. విద్యార్థుల నుంచి డబ్బులు వసూలుచేసి, వారికి చెల్లిస్తున్నాయనే ఆరోపణలున్నాయి.

జిల్లాలో ఈనెల పదో తేదీ నుంచి ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు జంబ్లింగ్ పద్ధతిలో ఎగ్జామినర్లను నియమిస్తారు. వారిని ప్రసన్నం చేసుకోవడానికి ఇప్పటికే ప్రైవేటు కళాశాలలు విద్యార్థుల నుంచి డబ్బు వసూలుచేసినట్టు సమాచారం. .

అక్రమాలకు పాల్పడితే చర్యలు: ఆర్ఐఓ

పరీక్షల నేపథ్యంలో నగదు వసూళ్లపై ఆర్ఐవో మురళీధర్‌ను వివరణ కోరగా విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే ఆయా కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షలకు నియమించిన సిబ్బంది ఎలాంటి అక్రమాలకు పాల్పడినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	455
విజయనగరం	459
శ్రీకాకుళం	459